# తెలంగాణ ప్రభుత్వము

# బడ్జెట్ ప్రసంగము

# 2018-19

ఈటల రాజేందర్
ఆర్థిక మంత్రి

2018, మార్చి 15వ తేదిన తెలంగాణ రాష్ట్ర శాసన సభకు
2018-19 సంవత్సరం బడ్జెట్‌ను సమర్పిస్తూ గౌరవనీయులైన
ఆర్థిక మంత్రి శ్రీ ఈటల రాజేందర్ గారి ప్రసంగం.

గౌరవ అధ్యక్షా!

తెలంగాణ రాష్ట్రంలో వరుసగా అయిదవసారి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం నాకు రావడం ఎంతో సంతోషంగా ఉంది. నాపై విశ్వాసంతో ఈ గురుతర బాధ్యతను అప్పగించినందుకు గౌరవనీయులైన ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

2. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దిగ్విజయంగా దాదాపు నాలుగేళ్లు పూర్తి కావచ్చింది. కొద్ది నెలల్లో అయిదవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న ఈ శుభ సందర్భంలో రాష్ట్ర సాధనకు మూడున్నర కోట్ల ప్రజానీకం చేసిన బహుముఖ పోరాటం, ఆ పోరాటం వెనుక ఉన్న ఎదురులేని నాయకత్వం, ఉమ్మడి రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలలో మనకు జరిగిన అన్యాయం, రాష్ట్రం ఏర్పడిన నాడు ఉన్న అస్తవ్యస్త పరిస్థితులు, ఆ పరిస్థితులను చక్కదిద్దే దిశగా వినూత్నమైన పథకాలను ప్రారంభించి రాష్ట్ర ఆర్థిక స్థితిని గాడిలోకి తెచ్చిన అంశాన్ని మనం తప్పకుండా మననం చేసుకోవాలి. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం కోసం మొదలైన ప్రయాణంలో ఎన్నో మైలురాళ్ళను అధిగమించాము. 45 నెలల స్వల్ప కాలంలో ఎన్నో అద్భుతాలను ఆవిష్కరించాం. చీకటినుంచి వెలుగులోకి, అపనమ్మకం నుంచి ఆత్మ విశ్వాసంలోకి, అణగారిన స్థితి నుంచి

అభ్యున్నతిలోకి, వలస బతుకుల నుంచి వ్యవసాయ ప్రగతి వైపు రాష్ట్ర ప్రజలను నడిపిస్తున్నాం. ఈ ప్రస్థానంలో భాగంగా సంక్షేమం, అభివృద్ధి ఫలాలను పేదలకు అందించాలనే ముఖ్యమంత్రి గారి ఆశయానికి అద్దం పడుతూ తెలంగాణ రాష్ట్ర అయిదవ బడ్జెట్‌ను రూపొందించాము.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి:

3. సమైక్య పాలనలో చివరి రెండేళ్లలో అనగా 2012-13, 2013-14 సంవత్సరాలలో తెలంగాణ ప్రాంత జి.ఎస్.డి.పి వృద్ధి రేటు, స్థిర ధరలల్లో, దేశ సగటు కన్నా తక్కువగా ఉండేది. పై రెండు సంవత్సరాలలో దేశ సగటు వృద్ధి రేటు 5.9 శాతం ఉండగా తెలంగాణ ప్రాంత సగటు వృద్ధి రేటు కేవలం 4.2 శాతం నమోదు అయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జి.ఎస్.డి.పి) లో గణనీయంగా ప్రగతిని సాధించాము.

4. సమైక్య రాష్ట్రంలో 2013-14 సంవత్సరంలో 5.4 శాతం మాత్రమే ఉన్న తెలంగాణ ప్రాంత జి.డి.పి వృద్ధి రేటు రాష్ట్రం ఏర్పడ్డాక మెరుగు పడింది. 2014-15 సంవత్సరంలో అది 6.8 శాతంగా నమోదు అయింది. రాష్ట్ర జి.డి.పి ఏటేటా పెరుగుతూ 2015-16 లో 8.6 శాతంగా, 2016-17 లో 10.1 శాతంగా నమోదు అయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అనగా 2017-18 సంవత్సరానికి రాష్ట్ర జి.డి.పి వృద్ధి రేటు 10.4 శాతంగా ఉండగలదని అంచనా. జి.డి.పి జాతీయ వృద్ధి రేటు 6.6 శాతం తో పోలిస్తే మన రాష్ట్ర వృద్ధి రేటు ఎంతో మెరుగ్గా ఉండడం ప్రశంసనీయం.

5.	పెద్ద నోట్ల రద్దు, జి.ఎస్.టి అమలు వల్ల కలిగిన ప్రారంభ ప్రతికూల పరిణామాలను అధిగమించి జి.డి.పి వృద్ధిలో జాతీయ ధోరణిని సైతం తోసిరాజని రెండంకెల వృద్ధి రేటు సాధించామని సగర్వంగా విన్నవిస్తున్నాను.

6.	సమైక్య ఆంధ్ర ప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతపు తయారీ రంగ పరిశ్రమ పరిస్థితి ఎప్పుడూ ఏటికి ఎదురీదినట్లే ఉండేది. తయారీ రంగంలో వృద్ధి రేటు ఏటేటా పడిపోతూ ఉండేది. రాష్ట్రం ఏర్పడ్డాక, విద్యుత్ రంగంలో సంస్కరణలు, పారిశ్రామిక రంగంలో పెట్టుబడులకు అనుకూల విధానం ప్రవేశపెట్టాము. నూతన పారిశ్రామిక విధానం వల్ల, 2015-16 సంవత్సరంలో తయారీ రంగంలో 6.4 శాతం వృద్ధి నమోదయ్యింది. 2016-17 నాటికి అది మరింత మెరుగుపడి 7.4 శాతంగాను, ముందస్తు అంచనాల ప్రకారం అది 2017-18 సంవత్సరంలో 7.6 శాతంగాను నమోదు కావడం గమనించాలి.

7.	విద్యుత్ రంగంలో, నీటి పారుదలలో వచ్చిన అభివృద్ధి వల్ల రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగింది. దిగుబడులు పెరిగాయి. వ్యవసాయ అభివృద్ధి ఆశాజనకంగా ఉన్నది. వ్యవసాయం దాని అనుబంధ రంగాల అభివృద్ధి 2017-18 లో 6.9 శాతానికి చేరుకున్నది. ప్రాజెక్టులు, చెరువుల ద్వారా సాగునీరు లభించడం, కోతల్లేని 24 గంటల కరెంటు సరఫరా, భూగర్భ జలాల సద్వినియోగంతో 2018-19 లో కూడా వ్యవసాయ అభివృద్ధి గణనీయంగా ఉంటుందని అంచనా వేస్తున్నాం. దీనికి తోడు సకాలంలో వానలు కురవాలని మనం కోరుకుందాం.

8. మొత్తానికి జి.ఎస్.డి.పి ప్రస్తుత ధరల ప్రకారం, గత ఏడాది 6,41,985 కోట్ల రూపాయలు ఉండగా, 2017-18 లో 7,32,657 కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. గత ఏడాదితో పోలిస్తే రికార్డు స్థాయిలో 14.1 శాతం అభివృద్ధి చెందింది.

9. రాష్ట్ర తలసరి ఆదాయం ఏటేటా మెరుగు పడుతున్నది. ప్రస్తుత ధరల్లో రాష్ట్ర తలసరి ఆదాయం 2016-17 సంవత్సరంలో రూ. 1,54,734/-. ఇది 2017-18 సంవత్సరంలో రూ.1,75,534 ఉంటుందని అంచనా. గత సంవత్సరంతో పోలిస్తే వృద్ధి రేటు 13.4 శాతంగా ఉన్నది. ఇది జాతీయ వృద్ధి రేటు అయిన 8.6 శాతంతో పోల్చితే ఎంతో ఎక్కువ.

10. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పరిస్థితి గమనిస్తే పురోగతి కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నది. విధానాల రూపకల్పనలో, ప్రజాహిత కార్యక్రమాల నిర్వహణలో తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన గుణాత్మకమైన మార్పు వల్లనే ఈ విజయం సాధ్యమయింది. మనకున్న వనరులను, మనకున్న అవసరాలను సరిగ్గా అంచనా వేసుకుని, దానికి అనుగుణంగా ప్రణాళికలు రచించుకుని ముందుకు సాగడం వల్లనే రాష్ట్రం ప్రగతిని సాధిస్తున్నది. ఇదే ఒరవడిలో రూపొందించిన 2018-19 బడ్జెట్ లోని ప్రధాన కేటాయింపులను మీ ముందు ఉంచుతున్నాను.

వ్యవసాయం:

11. రాష్ట్ర అభివృద్ధిలో వ్యవసాయరంగ అభివృద్ధి కీలకం. సమైక్య రాష్ట్రంలో అనుసరించిన విధానాల వల్ల తెలంగాణలో వ్యవసాయం పూర్తిగా సంక్షోభంలోకి నెట్టివేయబడింది. తెలంగాణ వ్యవసాయానికి పునరుజ్జీవం కల్పించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్ట పరచాలని ప్రభుత్వం సంకల్పించింది. రైతులకు తక్షణ తోడ్పాటు అందించడం కోసం ప్రభుత్వం మొదట పంట రుణాలను మాఫీ చేసింది. 35,29,944 మంది రైతులకు చెందిన 16,124 కోట్ల రూపాయల రుణాలను ప్రభుత్వమే బ్యాంకులకు చెల్లించింది.

పంట పెట్టుబడి మద్దతు పథకం:

12. సాగునీరు, పెట్టుబడి, గిట్టుబాటు ధరలను ప్రభుత్వం సమకూర్చినపుడే రైతుల కష్టాలు తీరుతాయి. ఒకవైపు ప్రాజెక్టులను శరవేగంగా నిర్మిస్తూ, మరోవైపు చెరువులను పునరుద్ధరించడం ద్వారా సాగునీటి సమస్యను పరిష్కరిస్తున్నాం. పెట్టుబడి సమస్యను పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం వినూత్నమైన, ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకున్నది. రైతుకు పంట సమయంలో పెట్టుబడి అనేది చాలా కీలకం. వ్యవసాయ పెట్టుబడి కోసం రైతులు అప్పుల పాలు అవుతున్నారు. పెట్టుబడి కోసం చేసిన అప్పు, దాని మీద పడే మిత్తి పులిమీద పుట్రలా ఒకదానికొకటి తోడై రైతును పూర్తిగా కృంగతీస్తున్నాయి. ఈ క్షోభ నుంచి రైతును కాపాడడం కోసం పంటకు

అవసరమైన పెట్టుబడిని ప్రభుత్వమే సమకూర్చాలని నిర్ణయించింది. రైతుల పక్షాన నిలిచి ఇంత గొప్ప నిర్ణయాన్ని స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఎన్నడూ ఏ ప్రభుత్వమూ తీసుకోలేదు. ఈ విషయంలో గౌరవ ముఖ్యమంత్రి కే.సి.ఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ దేశానికే మార్గదర్శకంగా నిలిచింది.

13. 2018-19 ఏడాది నుంచి ఎకరానికి 4,000 రూపాయల చొప్పున రెండు పంటల కోసం రెండు విడతల్లో ప్రతి రైతుకు మొత్తం 8,000 రూపాయలు ప్రభుత్వం అందిస్తుంది. పునాస పంట పెట్టుబడిని ఏప్రిల్ నుండి, యాసంగి పంట పెట్టుబడిని నవంబర్ నుండి రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు పంపిణీ చేస్తుంది. ఈ పథకం కోసం బడ్జెట్లో రూ.12,000 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

## సమగ్ర భూ సర్వే:

14. రైతుకు పెట్టుబడి సహాయం అందించాలి అని అంటే, భూ రికార్డులు సమగ్రంగా ఉండడం అనివార్యం. భూ రికార్డులను సమగ్రంగా సర్వే చేయించే మహత్తరమైన పనిని మా ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్రంలో 10,823 గ్రామాల్లోని భూరికార్డులను రెవెన్యూ శాఖకు చెందిన 1,507 బృందాలు ఖాతా వారిగా, అనగా 72,13,111 ఖాతాలు పరిశీలించి కావలిసిన మార్పులు చేశారు. రాత్రింబవళ్ళు కష్టపడి 100 రోజుల్లోనే భూరికార్డుల ప్రక్షాళన పూర్తి చేశారు. 96 శాతం భూరికార్డులు వివాదరహితమని ధృవీకరించాము. రాష్ట్రంలోని భూమి

రికార్డుల వివరాలు అన్ని పొందుపరిచిన "ధరణి" వెబ్‌సైటును త్వరలో ఆవిష్కరించనున్నాము.

సులభతర భూ రిజిస్ట్రేషన్లు:

15. రాష్ట్రంలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషను సులభతరం చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సేల్ డీడ్‌ను ప్రామాణీకరిస్తున్నాము. రిజిస్ట్రేషను ఆఫీసు లేని మండలాల్లో భూములు రిజిస్ట్రేషను చేసే బాధ్యతను మండల రెవిన్యూ అధికారులకు అప్పగించనున్నాము. దీనితో భూముల రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ రికార్డులలో మార్పులు ఏకకాలంలో జరుగుతాయి.

రైతు సమన్వయ సమితి:

16. అసంఘటిత రంగంలోని వర్గాలు హక్కులు సాధించుకోలేక పోతున్నాయి. వారిని పట్టించుకున్న వారే లేరు. సరిగ్గా తెలంగాణ రైతాంగానిది అదే పరిస్థితి. తమ హక్కులు, ప్రయోజనాల సాధనలో తెలంగాణ రైతాంగం ఎంతో వెనుకబడి ఉన్నది. సంఘటిత శక్తిలోని బలాన్ని గ్రహించక పోవడం వల్లనే రైతాంగానికి ఇన్ని సమస్యలు. ఆ బలానికి ఉన్న ప్రభావం ఒక్కసారి రైతుల అనుభవంలోకి రావాలి. రైతుల మధ్య ఐక్యతను, సమన్వయాన్ని సాధించాలన్న ముఖ్యమంత్రి గారి ఆలోచనకు ప్రతి రూపమే "రైతు సమన్వయ సమితి" ఆవిర్భావం.

17. రాష్ట్ర వ్యాప్తంగా 1,61,000 రైతులు సభ్యులుగా రైతు సమన్వయ సమితి ఏర్పాటైంది. గ్రామ స్థాయిలో 15 మందితో, మండలస్థాయిలో 24 మందితో, జిల్లా స్థాయిలో 24 మందితో, రాష్ట్ర స్థాయిలో 42 మందితో రైతు సమితుల ఏర్పాటు జరిగింది. రాష్ట్ర స్థాయి రైతు సమితులలో రైతు ప్రతినిధులతో పాటు, వ్యవసాయాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ రంగ నిపుణులు సభ్యత్వం కలిగి ఉంటారు.

18. ప్రభుత్వానికి, రైతులకు మధ్య అనుసంధానంగా రైతు సమన్వయ సమితి పనిచేస్తుంది. రైతుల మధ్య పరస్పర సహకార భావం ఏర్పరచడం, వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారానికి కావల్సిన చైతన్యాన్ని కలిగించడం, పండిన పంటకు మద్దతు ధర సాధించడమే రైతు సమన్వయ సమితి యొక్క ప్రధాన కర్తవ్యాలు. ఇందు కోసం రైతులకు, కొనుగోలుదారులకు మధ్య మధ్యవర్తిత్వం చేస్తుంది. ఒకవేళ మార్కెట్లో మంచి ధర రానట్టయితే స్వయంగా రంగంలోకి దిగి నేరుగా పంటను రైతు సమన్వయ సమితి కొనుగోలు చేస్తుంది. పంట కొనుగోలులో ప్రభుత్వం పూచిదారుగా ఉంటుంది మరియు తగిన నిధులు సమకూరుస్తుంది.

<u>రైతు వేదికలు:</u>

19. రైతులు పరస్పరం చర్చించుకోవడానికి వారికి ఒక వేదిక అవసరం. ప్రతీ ఐదువేల ఎకరాలు ఒక క్లస్టర్ గా విభజించి ప్రతీ క్లస్టర్‌కు ఒక వ్యవసాయ విస్తరణాధికారిని ప్రభుత్వం ఇదివరకే నియమించింది.

అదే విధంగా ప్రతి క్లస్టర్‌కు ఒక రైతు వేదికను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది.

<u>రైతు బీమా పథకం:</u>

20. రాష్ట్ర వ్యవసాయరంగంలో ఎక్కువ మంది చిన్న సన్నకారు రైతులే. ఈ రైతుల బాధలు వర్ణనాతీతము. ఒక్క సంవత్సరం పంటరాకపోతేనే ఆ రైతు కుటుంబం ఎన్నో కష్టాలను ఎదుర్కొంటోంది. అటువంటిది, ఆ కుటంబ పెద్ద అయిన రైతు మరణిస్తే ఒక్క సారిగా ఆ కుటుంబ పరిస్థితి తలకిందులు అవుతున్నది. భార్యా పిల్లల భవిష్యత్తు అగమ్య గోచరం అవుతున్నది. కనీస భరోసా లేకుండా పోతున్నది. అనుకోని పరిస్థితుల్లో అటువంటి కష్టం వస్తే, ఆ రైతు కుటుంబం అకస్మాత్తుగా రోడ్డున పడకూడదని ముఖ్యమంత్రి గారి సంకల్పం. ఆ కుటుంబానికి బాసటగా నిలవాలన్న ముఖ్యమంత్రిగారి ఆశయం నుండి రూపుదిద్దుకున్న పథకమే "రైతు బీమా పథకం". రాష్ట్రంలోని రైతులందరికి ఈ పథకం కింద రూ.5 లక్షల బీమా సదుపాయాన్ని కల్పించనున్నాము. రైతు బీమా పథకం కోసం ఈ బడ్జెట్లో రూ.500 కోట్లను ప్రతిపాదిస్తున్నాను.

<u>వ్యవసాయంలో యాంత్రీకరణకు ప్రోత్సాహం:</u>

21. వ్యవసాయంలో యాంత్రీకరణ వల్ల శ్రమతో పాటు ఖర్చు తగ్గుతుంది. సమయం ఆదా అవుతుంది. తద్వారా పెట్టుబడి కూడా

తగ్గుతుంది. వ్యవసాయంలో యంత్రాల వినియోగం విరివిగా జరిగేలా ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుంది. సబ్సిడీపై వివిధ యంత్రాలను, యంత్ర పరికరాలను రైతులకు అందిస్తున్నది. 50% నుండి 95% సబ్సిడీపై తెలంగాణలో రైతులకు ఇప్పటి వరకు 13,934 ట్రాక్టర్లు, 31,274 ట్రాక్టర్‌కు బిగించే సేద్య పరికరాలు, 4,71,000 తార్పాలిన్లు, 26,179 స్ప్రేయర్లు పంపిణీ చేశాం. వీటితో పాటు నాట్లు వేసే మిషన్లు కూడా సబ్సిడీ ధరల్లో అందించాలని సంకల్పించాము. వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించడం కోసం ఈ బడ్జెట్‌లో రూ.522 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాను.

బిందు తుంపర సేద్యం:

22. మన తెలంగాణకు బిందు, తుంపర సేద్యం ఎంతో ప్రయోజనకరమైనది. దీని ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణం సాగవుతుంది. రాష్ట్రంలో ప్రస్తుతం దాదాపు 14 లక్షల ఎకరాల్లో బిందు, తుంపర సేద్యం జరుగుతున్నది. మరో 29 లక్షల ఎకరాలను మైక్రో ఇరిగేషన్ కిందకి తేవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. మైక్రో ఇరిగేషన్ పరికరాల కొనుగోలు కోసం ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, చిన్న, సన్నకారు రైతులకు, బిసిలకు 90 శాతం, ఇతరులకు 80 శాతం సబ్సిడీలు అందిస్తున్నది. గతంలో ఒక రైతుకు గరిష్టంగా రెండున్నర ఎకరాలకు లక్ష రూపాయలు మించకుండా సబ్సిడీ ఇచ్చేవారు. తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం ఒక్కో రైతుకు పన్నెండున్నర ఎకరాల వరకు, 6.25 లక్షల రూపాయల వరకు సబ్సిడీ అందిస్తున్నది. మైక్రో ఇరిగేషన్‌ను

ప్రోత్సహించడానికి ఈ బడ్జెట్ లో 127 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాను.

పాలీహౌజ్, గ్రీన్ హౌజ్:

23. రాష్ట్రంలో చిన్న, సన్న కారు రైతులు కూడా పాలీ హౌజ్, గ్రీన్ హౌజ్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ ఇస్తున్నది. ప్రభుత్వ చర్యల వల్ల తెలంగాణలో గ్రీన్ హౌజ్, పాలీ హౌజ్ కల్టివేషన్ పెరిగింది. సమైక్య రాష్ట్రంలో కేవలం 129 ఎకరాలకు మాత్రమే పాలీ హౌజ్ కల్టివేషన్ పరిమితమైంది. ఒక్కో రైతు అర ఎకరా మాత్రమే పాలీ హౌజ్ వేసుకోవాలనే నిబంధన ఉండేది. సబ్సిడీ కేవలం 50 శాతం మాత్రమే ఇచ్చేవారు. ప్రస్తుతం మా ప్రభుత్వం 75 శాతం సబ్సిడీని పాలీహౌజ్ ఏర్పాటుకు అందిస్తున్నది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన 45 నెలల కాలంలో ప్రభుత్వం అందించిన ప్రోత్సాహకాలతో 1150 ఎకరాలకు పాలీహౌజ్ సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుత బడ్జెట్‌లో పాలీ హౌజ్, గ్రీన్ హౌజ్ వ్యవసాయం కోసం 120 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాను.

మార్కెటింగ్ సదుపాయాల అభివృద్ధి:

24. తెలంగాణ ఆవిర్భావం తర్వాత మార్కెటింగ్ శాఖను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. డిమాండుకు తగిన విధంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నది. కూరగాయలు, పండ్ల కోసం ప్రత్యేక మార్కెట్లను నిర్మిస్తున్నది. వినియోగ దారుల

సౌకర్యం కోసం సమీకృత మార్కెట్లను నిర్మిస్తున్నది. ఆధునిక హంగులతో రైతు బజార్ల నిర్మాణాన్ని చేపట్టింది. అదేవిధంగా రహదారుల పక్కన కూరగాయలు అమ్ముకునే వారికోసం సకల సదుపాయాలు ఉండే రోడ్ సైడ్ వెజిటేబుల్ మార్కెట్లను నిర్మిస్తున్నది.

గోదాముల నిర్మాణం:

25. రాష్ట్రంలో గోదాముల సామర్థ్యాన్ని ప్రభుత్వం గణనీయంగా పెంచింది. తెలంగాణ ఏర్పడే నాటికి కేవలం 4 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోదాములు మాత్రమే ఉండేవి. ఈ మూడున్నరేళ్లలో ప్రభుత్వం కొత్తగా 356 గోదాములు నిర్మించింది. దీంతో నిల్వ సామర్థ్యం 22.47 లక్షల టన్నులకు పెరిగింది. ప్రతీ మండలానికి ఒక గోదాము ఉండాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

కోల్డ్ స్టోరేజి లింకేజి:

26. వ్యవసాయ ఉత్పత్తులు చెడిపోకుండా ఎక్కువ కాలం నిల్వ చేసుకోవడానికి వీలుగా రాష్ట్ర వ్యాప్తంగా కోల్డ్‌స్టోరేజ్ లింకేజి ఉండాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మార్కెటింగ్ శాఖ చేపడుతున్న విస్తరణ అభివృద్ధి కార్యక్రమాల కోసం ఈ వార్షిక బడ్జెట్‌లో 132 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాను.

వ్యవసాయ మరియు మార్కెట్ రంగాలకు ఈ బడ్జెట్‌లో రూ.15,780 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

పౌర సరఫరాల శాఖ:

27. రాష్ట్ర ప్రభుత్వం, గత ఖరీఫ్ లో, మునుపెన్నడూ లేనంత రికార్డు స్థాయిలో, 5217 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, 11 లక్షల మంది రైతుల నుండి 53.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని, రూ.8,100 కోట్లు ఖర్చు చేసి కొనుగోలు చేసింది.

28. రాష్ట్రంలోని, అన్ని 17,027 చౌక ధరల దుకాణాలలో ఈ-పాస్ మెషిన్లు ఏర్పాటు చేయడం జరిగింది. దీని ద్వారా నిజమైన లబ్దిదారులకు సబ్సిడీ అందించే అవకాశం కలిగింది. పౌర సరఫరాల రంగానికి ఈ బడ్జెట్‌లో రూ.2,946 కోట్లు ప్రతిపాదిస్తున్నాము.

సాగునీటి ప్రాజెక్టులు:

29. తెలంగాణలో కోటి ఎకరాలకు నీరు అందించడం లక్ష్యంగా ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టింది. గోదావరి, కృష్ణ నదులపై 23 మేజర్, 13 మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. దశాబ్దాల తరబడి పెండింగ్ లో ఉన్న పాలమూరు ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేస్తున్నాం. ఇప్పటికే పాతపాలమూరు జిల్లాలో ఆరున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించాం. ఈ ఏడాది వర్షాకాలం పంట నాటికి 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం. వలసల జిల్లాగా పేరు పడిన పాలమూరు జిల్లాకు, ఫ్లోరైడ్ బాధిత పాత నల్గొండ జిల్లాకు, తీవ్ర దుర్భిక్షం ఎదుర్కొంటున్న పాత రంగారెడ్డి జిల్లాల్లోని బీడు భూములకు సాగునీరు అందించేందుకు శాశ్వత

పరిష్కారంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని శరవేగంగా నిర్మిస్తున్నాం. ప్రాజెక్టుల నిర్మాణం కోసం ప్రభుత్వం పట్టుదలతో చేస్తున్న కృషిపై ప్రజల్లో విశ్వాసం పెరిగింది. పొట్ట చేత పట్టుకొని వలస పోయిన కూలీలెందరో, తిరిగి తమ సొంత ఊళ్ళకు వస్తున్నారు.

30. రికార్డు సమయంలో భక్త రామదాసు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేశాము. కరువు పీడిత ప్రాంతమైన పాలేరు నియోజకవర్గం దీనితో సస్యశ్యామలమైంది. ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు గోదావరి నదిపై తలపెట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం నిర్మాణం పురోగతిలో ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, వరంగల్‌తో పాటు నల్లగొండ జిల్లాకు వరప్రదాయినిగా భావిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కొద్ది నెలల వ్యవధిలోనే వాటర్ పంపింగ్ పాక్షికంగా ప్రారంభించబోతున్నాం. మరో రెండేళ్లలో రిజర్వాయర్లు, కాల్వలతో సహా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేస్తాము. ఈ ప్రాజెక్టు కింద దాదాపు 36.75 లక్షల ఎకరాలకు నీరు అందించడానికి యుద్ధప్రాతిపదికన పనులు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నిరంతర కృషి వల్ల కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అనుమతులను సకాలంలో తెచ్చుకోగలిగాము.

31. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ కొనసాగుతున్నది. మొదటి మూడు దశల్లో అధిక శాతం నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ప్రధానమైన చెరువుల పునరుద్ధరణ పూర్తయింది. మిగతా చిన్న చెరువులు, కుంటల పనులు పురోగతిలో ఉన్నాయి.

32. ఈ ఏడాది నీటిపారుదల రంగానికి 25,000 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాను.

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టం:

33. నగరీకరణను మాత్రమే అభివృద్ధి అనుకుంటాము. అది తప్పు. అభివృద్ధి ఎప్పుడైనా పునాదుల నుంచి ప్రారంభం కావాలి. గ్రామీణ సమాజంలో వికాసం కలిగినప్పుడే అభివృద్ధి సమగ్రతను సంతరించుకుంటుంది. తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునరుత్తేజం కల్పించే ప్రణాళికను అమలు చేస్తున్నది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తగిన జీవిక ఏర్పడడానికి అవసరమైన కార్యాచరణను ప్రారంభించింది. వ్యవసాయాభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతూనే, వ్యవసాయ అనుబంధ రంగాలకు కావాల్సిన ఆర్థిక మద్దతును ప్రభుత్వం అందిస్తున్నది. గ్రామీణ వృత్తుల మీద ఆధారపడిన వర్గాల కోసం ప్రత్యేక పథకాలను రూపొందించింది.

34. గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం పంచాయితీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఈ అసెంబ్లీ సమావేశాల కాలంలోనే "కొత్త పంచాయితీ రాజ్ బిల్లు" ప్రవేశపెడుతున్నాము.

35. స్థానిక సంస్థల బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం అందించవలసిన నిధులపై అధ్యయనం చేసేందుకు కొత్తగా "తెలంగాణ రాష్ట్ర మొదటి ఫైనాన్స్ కమీషన్" ను నియమించాము.

36. అంతేకాకుండా గ్రామీణ స్థానిక సంస్థల పరిపుష్టానికి రూ.1,500 కోట్లు, పట్టణ స్థానిక సంస్థల పటిష్టత కోసం రూ.1,000 కోట్లు 2018-19 బడ్జెట్‌లో ప్రతిపాదిస్తున్నాను.
స్థానిక సంస్థల పటిష్టత కోసం మా ప్రభుత్వం కట్టుబడి ఉంది అనడానికి ఇదే ప్రబల నిదర్శనం.

గొర్రెల పెంపకం:

37. గొల్ల కురుమ సంప్రదాయ వృత్తి గొర్రెల పెంపకం. సరైన దృష్టితో ఆలోచిస్తే, గొర్రెల మందలు నిరంతరం పెరిగే పెద్ద సంపద. గత ప్రభుత్వాల ఉదాసీన వైఖరి వల్ల ఎంతో నైపుణ్యం కలిగిన గొల్ల, కురుమలకు ఎటువంటి ప్రోత్సాహం లభించలేదు. ప్రస్తుతం గొర్రెల పెంపకాన్ని ఒక పరిశ్రమగా అభివృద్ధి చేసి, రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాదిగా ఉన్న గొల్ల, కురుమల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున గొర్రెల పంపిణీ చేపట్టింది. మొదటి దశలో 4 లక్షల కుటుంబాలకు 84 లక్షల గొర్రెల పంపిణీ చేయాలని నిర్ణయించాం. ఈ ఏడాది ఇప్పటి వరకు 2 లక్షల 35 వేల కుటుంబాలకు, 50 లక్షల గొర్రెలను 75 శాతం సబ్సిడీపై పంపిణీ చేశాం. ఆ గొర్రెలు మరో 17 లక్షల గొర్రె పిల్లలను పెట్టడంతో తెలంగాణలో అదనంగా 67 లక్షల గొర్రెలు వచ్చి చేరినట్లయింది. గొర్రెల పంపిణీ మొదటి దశలో 5 వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రారంభించిన పథకానికి బడ్జెట్ కేటాయింపులే కాకుండా, బడ్జెటేతర పద్ధతిలో ఆర్థిక సంస్థల నుంచి రుణాల రూపంలో నిధులు సమకూర్చడం జరుగుతున్నది.

38. ఈ పథకం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టం అవుతున్నది. అదే సమయంలో రాష్ట్ర ప్రగతికి ఎంతగానో దోహదపడుతున్నది. రాష్ట్ర అవసరాలకు తగినంత మాంసాహారం రాష్ట్రంలోనే ఉత్పత్తి అవబోతుంది. మాంసోత్పత్తిలో రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నది. మాంసాన్ని ప్రాసెసింగ్ చేసి, దేశ విదేశాలకు ఎగుమతి చేసేందుకు పట్టణ ప్రాంతాల్లో మీట్ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభించడానికి ప్రభుత్వం తగు ప్రోత్సాహం చేస్తుంది.

<u>చేపల పెంపకం:</u>

39. గంగపుత్ర, ముదిరాజ్, బోయ, బంటు కులస్తులు చేపలు పట్టడమే వృత్తిగా జీవిస్తున్నారు. తెలంగాణలో వీరి సంఖ్య అధికం. చేపల పెంపకానికి కావాల్సిన జల వనరులు రాష్ట్రంలో పుష్కలంగా ఉన్నాయి. ఇప్పటికే ఉన్న రిజర్వాయర్లు, చెరువులకు తోడుగా, ప్రభుత్వం కొత్తగా ఎన్నో ప్రాజెక్టులు నిర్మిస్తున్నది. మిషన్ కాకతీయ ద్వారా వేలాది చెరువుల పునరుద్ధరణ జరుగుతున్నది. దీంతో వందలాది టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన జల వనరులు అందుబాటులోకి వస్తున్నాయి. వీటన్నింటిలో చేపల పెంపకాన్ని చేపడితే రాష్ట్రానికి ఎనలేని మత్స్య సంపద చేకూరుతుంది. రాష్ట్రంలోని మత్స్యకారులందరికి ఉపాధి ఏర్పడుతుంది. ఈ దిశగా ప్రభుత్వం పథకాన్ని రూపొందించి, అమలు చేస్తున్నది. ప్రతీ సంవత్సరం 3,20,000 టన్నుల చేపలను ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణను రూపొందించింది. దీనికోసం ఉచితంగా చేపపిల్లలను

పంపిణీ చేస్తున్నది. చేపలు పట్టుకునే హక్కులను పూర్తిగా మత్స్యకారులకే కల్పించింది. పట్టిన చేపలు అమ్ముకోవడానికి వీలుగా జిల్లాకు ఒకటి చొప్పున 31 హోల్‌సేల్ చేపల మార్కెట్‌లు మరియు 200 రిటైల్ మార్కెట్‌లు నిర్మిస్తాము. ఈ పథకానికి బడ్జెట్ కేటాయింపులే కాక బడ్జెటేతర పద్ధతిలో ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందడం ద్వారా నిధులు సమకూర్చడం జరుగుతున్నది.

## పౌల్ట్రీకి ప్రోత్సాహం:

40. హైదరాబాద్ నగర కేంద్రంగా పౌల్ట్రీ పరిశ్రమ అభివృద్ధి చెందింది. నేడు మన రాష్ట్రం ఎగ్ బాస్కెట్ ఆఫ్ ఇండియాగా పేరు పొందింది. కోళ్ల దానా ఉత్పత్తిలో, కోడి పిల్లల ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. కోడి మాంసం ఉత్పత్తిలో దేశంలో రెండవ స్థానం పొందింది. పౌల్ట్రీ పరిశ్రమ మీద ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది ఉపాధి పొందుతున్నారు. పౌల్ట్రీ అభివృద్ధి వల్ల గుడ్లు, మాంసం వంటి బలమైన అహారం సమృద్ధిగా లభిస్తున్నది. కోళ్ల పరిశ్రమకు ప్రభుత్వం సబ్సిడీపై కరెంటును అందిస్తున్నది. ఈ పరిశ్రమను మరింత ఉన్నత స్థితికి చేర్చడానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతుంది. కోళ్ళ పరిశ్రమ అభివృద్ధి కోసం ఈ బడ్జెట్‌లో 109 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాను.

సంక్షేమ రంగం:

41. పేద ప్రజలకు కనీసమైన భరోసా అందించాలని ప్రభుత్వం సంక్షేమ రంగం మీద ఎక్కువ నిధులు ఖర్చు చేస్తున్నది. దేశంలో ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయి. ప్రతీ ఇంటికి సంక్షేమం, ప్రతీ ముఖంలో సంతోషం అనే నినాదంతో ప్రభుత్వం తలపెట్టిన సంక్షేమ పథకాలు కనీస జీవన భద్రత కల్పిస్తున్నాయి. గౌరవ ముఖ్యమంత్రి గారి పరిపాలన సంక్షేమానికి స్వర్ణయుగంగా చెప్పవచ్చు.

ఆసరా పెన్షన్లు:

42. అసహాయులైన వారికి ఆసరాగా నిలిచేందుకు ప్రభుత్వం ప్రతినెలా పెన్షన్లు ఇస్తున్నది. వృద్ధులకు, వితంతువులకు, కల్లుగీత కార్మికులకు, నేత కార్మికులకు, ఎయిడ్స్ వ్యాధి బారిన పడ్డవారికి, బీడీ కార్మికులకి, ఒంటరి మహిళలకి నెలకు 1000 రూపాయలు చొప్పున, వికలాంగులకు, పేద వృద్ధ కళాకారులకు నెలకు 1500 రూపాయల చొప్పున సహాయం అందిస్తున్న సంగతి తెలిసిందే. వీరేకాక, బోదకాలుతో బాధపడే వారి కష్టాలను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణించి, వీరికి కూడా జీవన భృతిని నెలకు 1000 రూపాయల చొప్పున అందించాలని నిర్ణయించింది.

43. గతంలో నెలకు రూ.200 చొప్పున 31 లక్షల మందికి ఏడాదికి రూ.853 కోట్లతో పెన్షన్లు ఇస్తే, మా ప్రభుత్వం 41,78,291 మందికి

ఏడాదికి రూ.5,300 కోట్లతో పెన్షన్లు ఇస్తున్నాము. పేదలు, అసహాయుల పట్ల మా ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధకు ఇదొక నిదర్శనం.

కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్:

44. గౌరవ శాసనసభ్యులు మరియు ఇతర ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణలో, కళ్యాణలక్ష్మి పథకం అమలు సంతృప్తికరంగా సాగుతున్నది. పేద తల్లితండ్రులు ఆడ పిల్లల పెండ్లిళ్ళు చేయలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే కష్టాన్ని ఈ పథకం నివారించింది.

45. బాల్య వివాహాలను నిరోధించడానికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని బాలల హక్కుల ఉద్యమ కారుడు, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి ఇటీవలనే కరీంనగర్‌లో అభినందిచారు. మొదట ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలకు వర్తింపచేసిన ఈ పథకాన్ని, క్రమేణా, బీసీలు, అగ్రవర్ణాలలో పేదలకు కూడా అందచేస్తున్నాము. ఇప్పటి దాకా కళ్యాణలక్ష్మి పథకం క్రింద 2,12,126 మంది, షాదీముబారక్ క్రింద 78,003 మంది ప్రయోజనం పొందారు. ఈ పథకానికి, ఇప్పటిదాకా రూ.1625 కోట్లు ఖర్చు చేశాము.

46. కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ పథకానికి 2018-19 బడ్జెట్‌లో రూ. 1,450 కోట్లు కేటాయించడం జరిగింది.

## మహిళా శిశు సంక్షేమం:

47. సమాజంలో సగ భాగమైన మహిళలలో తమకు సమన్యాయం లభించటం లేదనే ఆవేదన ఉంది. చట్టసభల్లో 33% రిజర్వేషన్ కావాలని మహిళలు ఎంతోకాలంగా డిమాండ్ చేస్తున్నారు. సహేతుకమైన వారి డిమాండ్‌ను సమర్థిస్తూ మనం అసెంబ్లీలో తీర్మానం చేయడం జరిగింది. ప్రభుత్వం, రాష్ట్ర పరిధిలో ఉన్న అన్ని సంస్థలలో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పిస్తున్నాము. తెలంగాణ ఏర్పడిన తరువాత వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్‌లలో మహిళలకు ప్రాతినిధ్యం ఉండాలనే సదుద్దేశంతో వీరికి తొలిసారి, రిజర్వేషన్లను ప్రవేశ పెట్టాము. పోలీసు శాఖలో కూడా 33 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుంది. మహిళా శిశు సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో పక్కాగా అమలయ్యేందుకు 16 మంది మహిళా ఆర్గనైజర్లను సముచిత గౌరవ వేతనంతో నియమించాం.

## ఆరోగ్య లక్ష్మి - పోషకాహారం:

48. తెలంగాణ రాష్ట్రంలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు మరియు ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు పోషక ఆహారాన్ని అందించడం జరుగుతుంది. తల్లి బిడ్డలు ఆరోగ్యంకోసం, శిశువుల సంపూర్ణ వికాసం కోసం చక్కటి సంపూర్ణమైన

ఆహారం అందించాలి అనే ఉద్దేశంతో, ఆరోగ్య లక్ష్మి అనే పథకాన్ని అమలు చేస్తున్నాము.

49. తెలంగాణ ఏర్పాటుకు పూర్వం కేవలం 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు మినీ-వేడి భోజనం పెట్టేవారు. అంతేకాక గర్భిణీ మరియు బాలింతలకు 81 ICDS ప్రాజెక్టులలో మధ్యాహ్నం వేడి భోజనం లభించేది. మా ప్రభుత్వం పేదలందరికి కడుపునిండా భోజనం పెట్టాలని, రాష్ట్రంలో ఉన్న అన్ని అంగన్‌వాడి కేంద్రాలలో, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, పిల్లలకు ప్రతి రోజు, సమృద్ధిగా పోషక విలువలు ఉండే సంపూర్ణ భోజనాన్ని అందిస్తున్నది.

50. చిన్న పిల్లలకు గుడ్లతో పాటు గోధుమలు, పాలపొడి, శనగపప్పు, చక్కెర, నూనెలతో కూడిన రెండున్నర కిలోల ప్యాకెట్‌ను ప్రతి నెల మొదటి తేదిన అందజేస్తున్నది. ఈ పథకం ద్వారా 9,46,115 మంది ఏడు నెలల నుండి మూడు సంవత్సరాల లోపు పిల్లలు, 5,03,360 మంది మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలు మరియు 3,66,860 గర్భిణీ స్త్రీలు మరియు బాలింతలు లబ్దిపొందుతున్నారు.

51. ఆరోగ్యలక్ష్మి పథకంలో కేంద్ర సాయం ప్రతి మహిళకి 3 రూపాయల 50 పైసలు ఉంటే, రాష్ట్రం దానికి 5 రెట్లు అంటే, 17 రూపాయల 50 పైసలు కలిపి ప్రతి మహిళపై 21 రూపాయలు ఖర్చు చేస్తున్నాము. ఈ పథకం కింద వచ్చే సంవత్సరంలో రూ.298 కోట్లు ప్రతిపాదిస్తున్నాము.

52. అంగన్ వాడీ కార్యకర్తలు మరియు హెల్పర్ల భృతి రెండు విడతలుగా మన రాష్ట్రం వచ్చాక పెంచాము. సమాజంలో పేద మహిళలు మరియు పిల్లలకు సేవలు అందిస్తున్న 67,411 సిబ్బంది తద్వారా లబ్ధి పొందారు. అంగన్‌వాడీ వర్కర్లు అయితే రూ. 4,200 నుంచి రూ.10,500 కు, హెల్పర్లు అయితే రూ.2,200 నుండి రూ.6000 కు ప్రతి నెలా, వీరి గౌరవ వేతనం పెంచాము.

53. మహిళ శిశు సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో మొత్తం రూ.1,799 కోట్లు ప్రతిపాదించాం.

ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక ప్రగతి నిధి:

54. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం నిధులు ఖర్చు చేసే విషయంలో ప్రభుత్వం రెండు మంచి సంప్రదాయాలకు గత ఆర్థిక సంవత్సరం శ్రీకారం చుట్టింది. ఎస్సీ, ఎస్టీ వర్గాల జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రత్యేక ప్రగతి నిధిని ఏర్పాటు చేసింది. ఈ నిధిలో ఒక ఏడాదికి కేటాయించిన నిధులు ఖర్చు కాకుంటే అవి మరుసటి ఏడాదికి బదలాయింపు జరిగేలా చట్టం చేసింది. ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఇంత ఆదర్శవంతమైన చట్టం దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టలేదు. ఈ ఘనత తెలంగాణ రాష్ట్రానికే దక్కింది. ఈ ఏడాది కూడా ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక ప్రగతి నిధులను కేటాయిస్తున్నాం. 2018-19 బడ్జెట్‌లో షెడ్యూల్డ్ కులాల ప్రగతి నిధికి

రూ.16,453 కోట్లు ప్రతిపాదించడం జరిగింది. అదే విధంగా షెడ్యూల్డ్ తెగల ప్రగతి నిధికి రూ.9,693 కోట్లు ప్రతిపాదించడం జరిగింది.

షెడ్యూల్డు కులాల సంక్షేమం:

55. తెలంగాణ రాష్ట్రంలో 2011 జనాభ లెక్కల ప్రకారం, షెడ్యూల్డు కులాల జనాభా 50,08,300. ఆనాటి రాష్ట్ర జనాభాలో వీరి శాతం 15.45%. షెడూల్డు కులాల వారి విద్య మరియు ఆర్థిక అభివృద్ధికై రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తున్నది. రాష్ట్రంలో 675 వసతి గృహాల ద్వారా 55,576 మంది పిల్లలు లబ్ధి పొందుతున్నారు. 9 మరియు 10 వ తరగతి పిల్లల కోసం, ప్రత్యేక వసతిగృహాలు నిర్వహిస్తున్నారు. వీటిలో 17,373 మంది చదువు కుంటున్నారు. అర్హులైన షెడ్యూల్డు కులాల విద్యార్థులందరికి, చదువు కొన్నంత వరకు, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం జరుగుతుంది. దీనిద్వారా, సంవత్సరానికి రెండున్నర లక్షలు షెడ్యూల్డు కులాల విద్యార్థులకు లబ్ధి జరుగుతోంది. రాష్ట్రం ఏర్పడ్డాక, ఇప్పటివరకు, రూ. 1459 కోట్లు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం జరిగింది.

56. కళ్యాణలక్ష్మి పథకం క్రింద ఇప్పటిదాకా 71,770 షెడ్యూల్డ్ కులాల మహిళలకు, రూ. 436.86 కోట్లు లబ్ధి జరిగింది. తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకులాలలో 1,12,088 విద్యార్థులు చదువుతుంటే, అందులో ఎక్కువ భాగం 75,727 మంది బాలికలు ఉన్నారు. అతి పేద కుటుంబాల నుండి వచ్చిన ఈ పిల్లలు, విద్యా

రంగంలోనే కాక, ఇతర రంగాలల్లో కూడా రాణిస్తున్న విషయం మీకు తెలుసు. దేశంలోని ప్రఖ్యాత విద్యా సంస్థలయిన ఐ.ఐ.టి, ఎన్.ఐ.టి, అజీం ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ విశ్వవిద్యాలయాలలో ఈ పిల్లలు చదువు కొనసాగిస్తున్నారు. ఈ సంస్థ లోని విద్యార్థులు పలు రాష్ట్ర మరియు దేశీయ అవార్డులు అందుకోవడం మనందరికి గర్వకారణం.

57. షెడ్యూల్డు కులాల శాఖకు రూ.12,709 కోట్లు ప్రతిపాదిస్తున్నాము.

<u>స్వయం ఉపాధికి ఆర్థిక మద్దతు పథకం:</u>

58. ఎస్సీ యువత స్వయం ఉపాధి పొందేందుకు అమలు చేస్తున్న ఎకనామికల్ సపోర్టు స్కీమ్‌లో సబ్సిడీలను గణనీయంగా పెంచింది. గత ప్రభుత్వాల కాలంలో సబ్సిడీ గరిష్ట పరిమితి లక్ష రూపాయలుంటే, దాన్ని మా ప్రభుత్వం 5 లక్షలకు పెంచింది.

<u>దళితులకు 3 ఎకరాల భూ పంపిణీ:</u>

59. దళితులకు 3 ఎకరాల భూ పంపిణీ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తున్నాం. భూమి లభ్యతను బట్టి కొనుగోలు చేసి, దళితులకు పంపిణీ చేస్తున్నాం. తెలంగాణ ఏర్పడిన తర్వాత 45 నెలల సమయంలో 4,939 మంది దళితులకు 12,745 ఎకరాల భూమిని పంపిణీ చేశాం. ఈ పథకానికి బడ్జెట్లో రూ.1,469 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

## టి-ప్రైడ్:

60. ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం తెలంగాణ స్టేట్ ప్రోగ్రామ్ ఫర్ రాపిడ్ ఇంకుబేషన్ ఆఫ్ దళిత్ ఎంటర్ ప్రెన్యూర్స్ (T-PRIDE) అనే కొత్త కార్యక్రమం అమలు చేస్తున్నది. కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే వారికి, ఇప్పటికే ఏర్పాటైన పరిశ్రమలను విస్తరించాలనుకుంటున్న వారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. ఎస్సీ, ఎస్టీలు స్థాపించే పరిశ్రమలకు ఒక్కో యూనిట్‌కు రూపాయిన్నర చొప్పున విద్యుత్ సబ్సిడీ అందిస్తున్నాం. చిన్న తరహా పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పడానికి తీసుకునే రుణాలపై కేవలం పావలా వడ్డీ మాత్రమే చెల్లించే వెసులుబాటును కల్పిస్తున్నాం. ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ కార్యక్రమం ద్వారా పరిశ్రమల స్థాపనకు అయ్యే వ్యయంలో ఎస్సీ, ఎస్టీలకు 35 శాతం సబ్సిడీని ప్రభుత్వం అందిస్తున్నది. ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు 45 శాతం సబ్సిడీ ఇస్తున్నది. ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీలకు తగు శిక్షణ ఇచ్చి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల కాంట్రాక్టు పనులు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## షెడ్యూల్డ్ తెగల సంక్షేమం:

61. 2011 జనాభా లెక్కల ప్రకారంగా తెలంగాణ రాష్ట్రంలో షెడ్యూల్డ్ తెగల వారి జనాభా 32.87 లక్షలు ఉన్నది. రాష్ట్రంలో 32 షెడ్యూల్డ్ తెగలు

ఉండగా, అందులో 4 తెగలు పి.వి.టి.జి లు గా పరిగణిస్తారు. మా ప్రభుత్వం షెడ్యూల్డ్ తెగల సంక్షేమానికి పలు అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నది.

62. షెడ్యూల్డ్ తెగల వారి పిల్లలకు చదువు చెప్పడం ప్రభుత్వ ప్రాధాన్యత. దీనికై, 319 ఆశ్రమ పాఠశాలలు, 149 వసతి గృహాలు, 1432 గిరిజన ప్రాధమిక పాఠశాలలు, 163 పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలు, 85 గురుకుల పాఠశాలలు, 29 మినీ గురుకులాలు, 33 గురుకుల జూనియర్ కాలేజీలు మరియు 22 గురుకుల డిగ్రీ కాలేజీలు పనిచేస్తున్నాయి. ఈ సంస్థలలో 2,06,428 విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసిస్తున్నారు.

63. ఆర్థిక అభివృద్ధి పథకాల క్రింద, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 20,000 మంది లబ్ధిదారులకు సహాయం చేయడం జరుగుతుంది. భూమి అభివృద్ధి పథకం క్రింద 5000 మంది షెడ్యూల్డ్ తెగల లబ్దిదారులకు సాగునీటి వసతి అందించటం జరుగుతుంది. రాష్ట్రంలోని ఐ.టి.డి.ఏ ప్రాంతాలలో 354 షెడ్యూల్డ్ తెగల గ్రామాలకు మరియు 619 షెడ్యూల్డ్ తెగల ఆవాసాలకు తారు రోడ్లు వేయడానికి ప్రతిపాదిస్తున్నాము. షెడ్యూల్డ్ తెగల సంస్కృతికి చిహ్నాలు అయిన జంగుబాయి జాతర, నాగోబా జాతర, సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవడం జరుగుతున్నది.

షెడ్యూల్డు తెగల శాఖకు రూ. 8,063 కోట్లు ప్రతిపాదిస్తున్నాము.

తండాలు - గ్రామ పంచాయితీలు:

64. గ్రామాల్లోనే తండాలు ఓ వార్డుగా ఉండడం వల్ల మౌళిక సదుపాయాల కల్పనలలో వివక్ష ఎదురవుతున్నది. గిరిజన తండాలను, ఆదివాసీ గూడేలను ప్రత్యేక గ్రామ పంచాయితీలుగా గుర్తించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్నది. వారి చిరకాల వాంఛను నెరవేరుస్తూ, తెలంగాణలో తండాలను, ఆదివాసీ గూడేలను గ్రామ పంచాయితీలుగా ప్రభుత్వం గుర్తించబోతున్నది.

వెనుకబడిన తరగతుల సంక్షేమం:

65. రాష్ట్ర జనాభాలో 52% ఉన్న వెనుకబడిన తరగతుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నది. రాష్ట్రంలోని 450 ప్రీమెట్రిక్ వసతిగృహాలు, 250 కాలేజీ వసతి గృహాల ద్వారా 73,301 విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం క్రింద 7,58,093 మంది విద్యార్థులకు ట్యూషన్ మరియు మెయిన్‌టెనెన్స్ ఫీజు ఇవ్వడం జరుగుతుంది. ఈ పథకం క్రింద, ఆర్థికంగా వెనుకబడిన 88,708 విద్యార్థులకు కూడా ప్రయోజనం కలుగుతున్నది. మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ వెనుక బడిన తరగతుల గురుకుల విద్యాలయాల ఆధ్వర్యంలో 192 గురుకుల పాఠశాలలు, 19 గురుకుల కళాశాలలు మరియు ఒక మహిళా డిగ్రీ కళాశాల, 40,075 మందికి ఆద్భుతమైన విద్యను అందిస్తున్నాయి.

ఇందులో 119 గురుకుల పాఠశాలలు గత సంవత్సరం జూన్ 12న ప్రారంభింపబడి, చరిత్ర సృష్టించాయి.

66. తమ వృత్తుల ద్వారా సమాజానికి సేవ చేస్తున్న నాయీ బ్రాహ్మణులు, రజకులు, మేదరి, వడ్డెర, విశ్వకర్మలు, గౌడ తదితర కుల వృత్తుల వారందరికీ అవసరమైన ఆర్థిక సహకారం ఇచ్చి, పరికరాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్దిష్ట పథకాల రూపకల్పన జరుగుతున్నది.

67. కనీస గుర్తింపుకు కూడా నోచుకోకుండా అత్యంత వెనుకబాటు తనాన్ని అనుభవిస్తున్న ఎం.బి.సి కులాల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. ఈ ఏడాది బడ్జెట్లో 1000 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాను.

68. రజకుల ఫెడరేషన్‌కు రూ.200 కోట్లు మరియు నాయీబ్రాహ్మణ ఫెడరేషన్‌కు రూ.250 కోట్లు ఈ సారి బడ్జెట్‌లో ప్రతిపాదిస్తున్నాం.

వెనుకబడిన తరగతుల అభివృద్ధికై ఈ సారి బడ్జెట్‌లో రూ.5,920 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

మైనారిటీ సంక్షేమం:

69. తెలంగాణలో మైనారిటీలు ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే పేదరికం అనుభవిస్తున్నారు. అందుకే ఎస్సీ, ఎస్టీల సర్వతోముఖాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలన్నీ, మైనారిటీలకూ అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. మైనారిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను బలోపేతం చేసింది. మైనారిటీల సంక్షేమానికి ప్రతీ ఏటా నిధులు పెంచుతున్నది. మైనార్టీల విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన ప్రభుత్వం, గత నాలుగు సంవత్సరాలలో 206 గురుకుల విద్యా సంస్థలను ప్రారంభించింది. వీటిలో 47,818 మంది విద్యార్థులు నాణ్యమైన చదువు నేర్చుకొంటున్నారు. ఇన్ని సంస్థలు ఒకటే సారి ప్రారంభిస్తే, పిల్లలు ఎక్కడినుండి వస్తారు అని అన్నారు. కానీ, ఈ రోజున, ఈ గురుకులాలలో చేరడానికి, విపరీతమైన పోటీ నెలకొని ఉంది. మంచి ప్రణాళికతో చేసే కార్యక్రమం, ప్రజల అవసరాలకు అనుగుణంగా చేసే కార్యక్రమం, వారి మన్ననలు పొందుతుంది అనడానికి ఇది ఒక ఉదాహరణ. ఈ విద్యా సంస్థలపై, రూ.735 కోట్లు ప్రతిపాదిస్తున్నాం.

70. ముస్లిం అనాథ పిల్లలకు ఆశ్రయం ఇస్తున్న అనీస్ ఉల్ గుర్బాకు 4300 చదరపు గజాల స్థలాన్ని కేటాయించింది. భవన నిర్మాణానికి రూ. 20 కోట్లు కేటాయించింది.

71. మైనారిటీ యువతకు స్వయం ఉపాధి పథకాలలో సబ్సిడీని 50 నుంచి 80 శాతానికి పెంచింది. రంజాన్, క్రిస్‌మస్ వేడుకలకు ప్రతీ

సంవత్సరం 2 లక్షల మందికి కొత్త దుస్తులను పంపిణీ చేస్తున్నది. ప్రార్థనా మందిరాలలో ప్రభుత్వమే విందులను ఏర్పాటు చేసి పండుగ రోజుల్లో వారితో సంతోషం పంచుకుంటున్నది. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణ లో ఐదు వేల మసీదుల్లో ప్రార్దనలు చేసే ఇమామ్, మౌజామ్‌లకు నెలకి 1500 రూపాయల భృతిని అందిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 8,934 మంది ఇమామ్, మౌజామ్ లకు దీని వల్ల ప్రయోజనం చేకూరుతున్నది. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో హైదరాబాద్ ఇస్లామిక్ సెంటర్-కమ్-కన్వెషన్ హాల్ నిర్మాణానికి కోకాపేటలో 10 ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగింది. ఉర్దూ భాష పరిరక్షణకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉర్దూ టీచర్ల నియామకం చేపట్టింది.

72. మైనారిటీ శాఖకు గత సంవత్సరం రూ.1200 కోట్లు ఉంటే ఈ సారి దానికి గణనీయంగా పెంచి, రూ.2,000 కోట్లు ప్రతిపాదిస్తున్నాము.

ఇతర వర్గాల సంక్షేమం:

73. బ్రాహ్మణులకు సామాజికంగా గౌరవం లభిస్తున్నా, ఆర్థికపరమైన వెనుకబాటుతనం వేధిస్తున్నది. వీరి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ప్రతీ ఏటా వందకోట్లు కేటాయిస్తున్నది. వచ్చే ఏడాది కూడా బడ్జెట్లో బ్రాహ్మణుల సంక్షేమానికి వంద కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాను.

74. తెలంగాణ సామాజిక వికాసంలో రెడ్డి హాస్టల్ గణనీయమైన పాత్ర పోషించింది. కొత్వాల్ రాజ బహదూర్ వెంకట్రామరెడ్డి లాంటి పెద్దలు పూనుకుని స్థాపించిన రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాలు ఇటీవలనే ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వం రెడ్డిహాస్టల్ కోసం బుద్వేల్ లో 15 ఎకరాల స్థలం కేటాయించింది. ఈ స్థలంలో భవన సముదాయాల నిర్మాణం కోసం గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రత్యేక శ్రద్ధతో పదికోట్ల రూపాయలు మంజూరు చేశారు.

75. ప్రతి సామాజిక వర్గం కోసం హైదరాబాద్ నగరంలో స్థలం కేటాయించి భవనం నిర్మించాలని ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకున్నది. ఈ భవనాలు ఆయా సామాజిక వర్గాల వికాస కేంద్రాలుగా ఉపయోగపడాలని ప్రభుత్వం ఆశిస్తున్నది.

76. సమాజంలో అన్ని వర్గాల సంక్షేమం పట్ల ప్రభుత్వం శ్రద్ధ చూపిస్తున్నది. దేశంలో ఎక్కడా లేని విధంగా కలం కార్మికులైన జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసింది. ఇప్పటికే 130 కోట్ల నిధిని సమకూర్చింది. ఈ నిధి ద్వారా అకాల మరణానికి గురైన జర్నలిస్టు కుటుంబానికి లక్ష రూపాయల ఎక్స్‌గ్రేషియాతో పాటు, ప్రతీ నెలా జీవన భృతిని కల్పిస్తున్నది. ఈ బడ్జెట్లో జర్నలిస్టుల సంక్షేమం కోసం 75 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాను. అలాగే న్యాయవాదుల సంక్షేమం కోసం వందకోట్ల నిధిని ఏర్పాటు చేసిన ఏకైక ప్రభుత్వంగా తెలంగాణ ప్రభుత్వం తన ప్రత్యేకతను చాటుకున్నది.

డబుల్ బెడ్ రూం ఇండ్లు:

77. నిరుపేదలు కూడా సౌకర్యవంతంగా ఉండే ఇండ్లలో జీవించాలనే సదుద్దేశ్యంతో ప్రారంభించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం వేగం పుంజుకున్నది. పేదలపై ఒక్క రూపాయి కూడా భారం పడకుండా మొత్తం ప్రభుత్వమే భరించి, డబుల్ బెడ్ రూము ఇళ్లు కట్టే పథకం ఒక్క తెలంగాణలో తప్ప దేశంలో మరెక్కడా అమలు కావడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా 2,72,763 ఇండ్లు మంజూరు చేశాము. 9,522 ఇండ్లు పూర్తయ్యాయి. 1,68,981 ఇండ్లు పురోగతిలో ఉన్నాయి. డబుల్ బెడ్ రూం ఇండ్లకి 2018-19 సంవత్సరంగాను బడ్జెట్లో రూ.2,643 కేటాయించాము. ఈ పథకం అమలుకు ప్రభుత్వం నిధులు సమకూర్చడంతో పాటు వివిధ బ్యాంకుల నుంచి, ఆర్థిక సంస్థల నుంచి రుణాలను సమకూర్చుకున్నాం.

వైద్యం - ఆరోగ్యం:

78. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మా ప్రభుత్వం అమలు చేసిన సమగ్ర ప్రణాళిక వల్ల ప్రజారోగ్య వ్యవస్థ ఎంతో మెరుగుపడింది. ప్రజారోగ్య వ్యవస్థను విస్తృత పరచడానికి, సౌకర్యాలను మెరుగుపర్చడానికి అనేక చర్యలు తీసుకున్నది. గతంలో ప్రభుత్వ వైద్యశాలల మీద తీవ్రమైన నిర్లక్ష్యం చూపించడం వల్ల, ప్రజలు వాటిపై నమ్మకం కోల్పోయారు. ప్రభుత్వ వైద్యం మీద ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్దరించే విధంగా ప్రభుత్వం కృషి చేసింది. ప్రాథమిక ఆరోగ్య

కేంద్రాలు మొదలుకుని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వరకు అన్ని ప్రభుత్వ వైద్యశాలలకు నేరుగా నిధులు అందిస్తున్నది. హాస్పిటళ్లలో బెడ్ల సంఖ్యను బట్టి నిధులను కేటాయించి, నేరుగా ఆసుపత్రులకే విడుదల చేస్తున్నది. హాస్పిటళ్లలో మందుల కొనుగోలుకు నిధులను రెట్టింపు చేసింది. పాత బెడ్లు, బెడ్ షీట్లు, సెలైన్ స్టాండ్లు ఉండే హాస్పిటళ్ల తీరును పూర్తిగా మార్చేసింది. కొత్తవి అందించింది.

79. రాష్ట్ర వ్యాప్తంగా 34 ప్రభుత్వాసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి, ఉచితంగా డయాలసిస్ సేవలు అందిస్తున్నది. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి వైద్యం అందించడానికి గతంలో ప్రభుత్వాసుపత్రుల్లో ఐసియులు ఉండేవి కాదు. చాలా చోట్ల కనీసం ఆక్సిజన్ సదుపాయం కూడా ఉండేది కాదు. మా ప్రభుత్వం 22 ప్రభుత్వాసుపత్రుల్లో ఐసియులను ఏర్పాటు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 12 చోట్ల క్యాన్సర్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి, లక్షలాది మందికి పరీక్షలు నిర్వహిస్తున్నది. క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే పసిగట్టి, సరైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడడానికి ఈ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

80. తక్షణ వైద్యం అందించడం కోసం హైదరాబాద్ నగరంలో ఎమర్జెన్సీ మోటార్ సైకిల్ సేవలను ప్రారంభించింది. 50 టీకా బండ్లను బస్తీల్లో తిప్పుతూ పేద పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా ఎఎన్ఎమ్ లందరికీ పది నుంచి 25 వేల సబ్సిడీతో స్కూటీలు అందిస్తున్నాం.

81. ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దాన్ క్యూర్ అన్నట్టుగా రోగాలు రాకుండా ముందే అరికట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరికీ ఉచిత వైద్య పరీక్షలు జరపబోతున్నాం. అదే విధంగా కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా కళ్లద్దాలను అందించబోతున్నాం.

82. రాష్ట్ర వైద్యవిద్యను మరింత అభివృద్ధి చేయడం కోసం కొత్తగా వైద్య కళాశాలలను నెలకొల్పుతున్నాం. మహబూబ్‌నగర్, సిద్దిపేట, నిజామాబాద్ లలో ఇప్పటికే వైద్య కళాశాలలు మంజూరు చేశాం. కొత్తగా సూర్యాపేట, నల్గొండలో ఏర్పాటు చేస్తున్నాం.

## అమ్మఒడి పథకం:

83. గర్భవతులైన మహిళలకు ప్రత్యేక రక్షణ, అదనపు జాగ్రత్తలు, సౌకర్యాలు అవసరం. అయితే పేదరికం వల్ల ఎంతో మంది మహిళలకు ఇవి అందుబాటులో వుండవు. రాష్ట్రంలో నిరుపేద గర్భిణీ స్త్రీలు ఎదుర్కొనే సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అమ్మఒడి అనే పథకాన్ని అమలు చేస్తున్నది. ఈ పథకం దేశంలో అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. గర్భిణీ స్త్రీలు ప్రసవం కోసం ఆసుపత్రికి వెళ్ళడానికి, ప్రసవానంతరం క్షేమంగా తిరిగి ఇంటికి చేరడానికి ప్రత్యేక వాహన సదుపాయాన్ని ప్రభుత్వమే ఉచితంగా కల్పిస్తున్నది. మారుమూల ప్రాంతాల్లో నివసించే గర్భిణీ స్త్రీలకు ఈ పథకం ఒక వరం. 102 అనే నెంబర్‌కు ఫోన్ చేస్తే చాలు ప్రత్యేక సదుపాయాలున్న వాహనం గర్భిణీ స్త్రీ ఉండే ఇంటి ముందుకు వస్తుంది. అదే విధంగా

ప్రసవానంతరం తల్లినీ బిడ్డను క్షేమంగా ఇంటికి చేరుస్తుంది. రాష్ట్రంలో 250 వాహనాలు అమ్మఒడి పథకం కోసం గర్భిణీ స్త్రీల సేవకు ఉపయోగిస్తున్నాము. గర్భిణీ స్త్రీల సంక్షేమం కోసం అమలవుతున్న ఈ పథకానికి ప్రభుత్వం 2018-19 బడ్జెట్లో రూ.561 కోట్లు కేటాయించడం జరిగింది.

గర్భిణీ స్త్రీలకు కే.సి.ఆర్ కిట్ పథకం:

84. దేశంలో నేటికి ప్రసూతి మరణాలు సంభవిస్తూ ఉండటం పెద్ద విషాదం. చాలా మంది మహిళలు ప్రసవం కోసం ఆసుపత్రులకు రాకుండా నాటు పద్ధతులను ఆశ్రయిస్తుండటం దీనికి ఒక కారణం. మరో వైపు ప్రసూతి కోసం వచ్చే వారికి అనవసరంగా ఆపరేషన్లు చేసి వారి ఆరోగ్యానికి ముప్పు తెస్తున్న ప్రైవేట్ డాక్టర్ల నిర్వాకం ఆందోళన కలిగిస్తున్నది. ఈ రెండు ప్రమాదాలను నివారించడానికి తెలంగాణ ప్రభుత్వం ఒక గొప్ప పథకాన్ని ప్రవేశ పెట్టింది. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల కోసం చేరేవారికి కే.సి.ఆర్ కిట్లను అందిస్తున్నది. ఎంతో మంది పేద మహిళలు గర్భవతిగా ఉండే సమయంలో కూడా బతుకుతెరువు కోసం పనిచేయవలసిన దుస్థితిని ఎదుర్కుంటున్నారు. గర్భిణీ గా ఉన్న స్త్రీ తగిన విశ్రాంతికి నోచుకోకుండా పనులు చేయడం వలన ఆమెకు మాత్రమే కాక గర్భం లోని శిశువుకూ ప్రమాదం. తెలంగాణ ప్రభుత్వం గర్భవతిగా ఉన్న స్త్రీ ఆ దశలో కోల్పోయే ఆదాయాన్ని పూరించాలని నిర్ణయం తీసుకున్నది. గర్భం దాల్చిన నాటినుండి ప్రసవం జరిగి శిశువుకు 3 నెలల వయసు వచ్చేంతవరకు మూడు విడతలలో ప్రతి

విడతకు నాలుగు వేల చొప్పున మొత్తం పన్నెండు వేల రూపాయలను ప్రభుత్వం అందిస్తున్నది. ఆడపిల్లను కన్న తల్లికి అదనంగా మరో వెయ్యి రూపాయలు అందిస్తున్నది. ప్రసవానంతరం తల్లీ బిడ్డలకు అవసరమైన వస్తువులతో ప్రత్యేకమైన ఒక కిట్‌ను కేసీఆర్ కిట్ పేరుతో అందిస్తున్నది. బేబి సోప్, బేబి ఆయిల్, బేబి పౌడర్, దోమ తెర, నాప్‌కిన్స్, డయాపర్ తదితర వస్తువులు ఇందులో ఉంటాయి. కేసీఆర్ కిట్ పథకం రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 2, 2017 నుండి అమలు చేయడం జరిగింది. ఇప్పటి దాకా 8,26,143 గర్భిణీ స్త్రీలు తమ పేర్లు నమోదు చేసుకున్నారు మరియు 1,78,048 కిట్ల పంపిణీ జరిగింది. కే.సి.ఆర్ కిట్ ద్వారా అందుతున్న ప్రయోజనాల వల్ల ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య రికార్డు స్థాయిలో పెరిగింది. గతంలో కంటే 51 శాతం డెలివరీలు పెరిగాయి. ప్రసవ సమయంలో ప్రతి వెయ్యి డెలివరీలలో శిశు మరణాల రేటు 39 నుంచి 31కి తగ్గింది. ఈ పథకానికి దేశ విదేశాలకు చెందిన ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల నుంచి అవార్డులు, ప్రశంసలు వస్తున్నాయి.

85. వైద్య రంగం అభివృద్ధికి 2018-19 బడ్జెట్లో రూ.7,375 కోట్లు ప్రతిపాదిస్తున్నాం.

విద్యా రంగం:

86. విద్యారంగం అభివృద్ధి చెందితేనే, పిల్లలకు సుస్థిర భవిష్యత్తు మరియు సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రంలో

41,337 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 58,66,786 మంది పిల్లలు చదువు నేర్చుకుంటున్నారు. ప్రభుత్వ రంగ విద్యాసంస్థలలో అత్యధికంగా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, వెనుకబడిన తరగతులు మరియు మైనార్టీల పిల్లలు చదువుతున్నారు. వీరికి నాణ్యమైన విద్య అందించే బాధ్యత ప్రభుత్వము మీద ఉంది.

87. రాష్ట్రం ఏర్పడిన తరువాత, 8792 టీచర్లను పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా నియామకం చేసుకోబోతున్నాము. వచ్చే విద్యా సంవత్సరానికి ఈ టీచర్లంతా పాఠశాలల్లో ఉంటారు.

88. సర్వశిక్షా అభియాన్ పథకం క్రింద, గతమూడు సంవత్సరాలలో, పాఠశాలలో మౌలిక వసతుల కోసం, 44,588 పనులను చేపట్టి, 38,182 పూర్తి చేయడం జరిగింది. 391 కస్తూరిబా గాంధి బాలికా విద్యాలయాలలో, 72,824 మంది బాలికలు చదువుకుంటున్నారు. కస్తూరిబా గాంధి బాలికా విద్యాలయాలల్లో వసతుల మెరుగు కోసం రూ.92.30 కోట్లు ఖర్చు పెడుతున్నాము. వీటిలో పనిచేస్తున్న స్పెషల్ ఆఫీసర్లు, సిఆర్‌టీలు, అకౌంటెంట్స్ మరియు ఇతర సిబ్బంది జీతాలు పెంచడం జరిగింది.

89. రాష్ట్రంలో 194 మోడల్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రహరీ గోడల కోసం రూ.78 కోట్లు ఖర్చు పెట్టాము. ఈ పాఠశాల్లో, నమోదు ప్రతి సంవత్సరం పెరుగుతోంది. మధ్యాహ్న భోజన పథకం క్రింద సన్న బియ్యం మరియు వారానికి మూడు రోజులు గుడ్లు లేదా అరటిపండు

ఇవ్వడం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత, 25.48 లక్షల పిల్లలకు ఇది అదనంగా అందిస్తున్నాము.

90. ఈ బడ్జెట్‌లో పాఠశాల విద్యకు రూ.10,830 కోట్లు ప్రతిపాదిస్తున్నాము.

<u>ఉన్నత విద్య:</u>

91. రాష్ట్రంలో 404 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వసతులు మెరుగు పర్చడానికి ఇప్పటి వరకు రూ. 259 కోట్లు ఖర్చు పెట్టాము. వీటిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల భృతిని రెండు విడతలుగా రూ. 18,000 నుండి రూ. 27,000 మరియు రూ. 27,000 నుండి రూ. 37,100 కు పెంచాము.

92. సాంకేతిక విద్యా శాఖ లో క్రొత్తగా 11 పాలిటెక్నిక్‌లు ప్రారంభించడం జరిగింది. వీటి ఏర్పాటుకు రూ.95 కోట్లు కేటాయించడం జరిగింది.

93. రాష్ట్రంలో ఉన్న 131 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 10,634 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ కళాశాలల్లో, మౌలిక వసతుల కోసం, రూ. 247 కోట్లతో పనులు జరుగుతున్నాయి.

94. ఈ బడ్జెట్‌లో ఉన్నత విద్యా రంగానికి రూ.2,448 కోట్లు ప్రతిపాదిస్తున్నాము.

రెసిడెన్షియల్ విద్యా సంస్థలు:

95. విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్యను అందించాలనే బృహత్తర విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ 45 నెలల పరిపాలన కాలంలో ఈ విధానం అమలు దిశగా తొలి అడుగులు వేసింది. బలహీన వర్గాల విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధిలోకి రావాలనే సత్సంకల్పంతో ప్రభుత్వం రెసిడెన్షియల్ విద్యావిధానాన్ని ప్రోత్సహిస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా విరివిగా రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలను స్థాపించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎస్సీల కోసం 104, ఎస్టీల కోసం 53, మైనారిటీల కోసం 192, బిసి ల కోసం 142, మొత్తం 491 కొత్త రెసిడెన్షియల్ పాఠశాలలను నెలకొల్పింది. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ వర్గాల కోసం ఏర్పాటు చేసిన ఈ రెసిడెన్షియల్ పాఠశాలల్లోని సీట్లలో కొంత కోటాను అగ్రవర్ణాల్లోని పేద పిల్లల కోసం కేటాయించింది.

96. ఆడపిల్లలు చదువులో మరింత ముందంజ వేయాలని ప్రభుత్వం ఆశిస్తున్నది. చదువుకోసం గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు పోయి ఎస్సీ, ఎస్టీ అమ్మాయిలు పడుతున్న అవస్థలు గమనించిన ప్రభుత్వం, వారికోసం పెద్ద ఎత్తున రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేసింది. మొదటి దశలో ఎస్సీల కోసం 30, ఎస్టీల కోసం 22 మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలు ప్రారంభించింది.

97. నేడు రాష్ట్రంలోని రెసిడెన్షియల్ పాఠశాలల్లో మొత్తం 2,70,135 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మహిళా డిగ్రీ కళాశాలల్లో 16,160 మంది విద్యనభ్యసిస్తున్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో చదువుకునే ప్రతీ విద్యార్థి పైనా సాలీన లక్ష రూపాయల పైగా ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది.

ఎస్సీ రెసిడెన్షియల్ సంస్థలకు రూ.1,221 కోట్లు, ఎస్టీ రెసిడెన్షియల్ సంస్థలకు రూ.401 కోట్లు మరియు బీసీ రెసిడెన్షియల్ సంస్థలకు రూ.296 కోట్లు మైనారిటీ రెసిడెన్షియల్ సంస్థలకు రూ.735 కోట్లు, గురుకుల విద్యాలయాలకు రూ.170 కోట్లు కలిపి మొత్తంగా ఈ బడ్జెట్‌లో రెసిడెన్షియల్ సంస్థలకి రూ.2,823 కోట్లు ప్రతిపాదించడమైనది.

ఓవర్సీస్ స్కాలర్ షిప్స్:

98. పేదరికం కారణంగా విదేశాలలో విద్యను అభ్యసించే అవకాశం ఎవరూ కోల్పోకూడదు. అందుకే ప్రభుత్వం విదేశీ విద్య కోసం పెద్ద ఎత్తున ఓవర్సీస్ స్కాలర్షిప్ ను అందిస్తున్నది. గత ప్రభుత్వాల కాలంలో కేవలం 10 లక్షల రూపాయలు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మాత్రమే అందించేవారు. ఇది గత పాలకుల హ్రస్వ దృష్టికి నిదర్శనం. నేడు తెలంగాణా ప్రభుత్వం విద్యార్థులకు మహనీయులైన అంబేద్కర్, జ్యోతిరావు ఫూలేల పేర్ల మీద 20 లక్షల రూపాయలు అందిస్తున్నది. అంతేకాదు పథకం ప్రయోజనాలను ఎస్సీ, ఎస్టీ లతో పాటు బీ.సీ, ఇ.బి.సీ విద్యార్థులకు కూడా అంద జేస్తున్నది. బలహీన వర్గాల

విద్యార్థులు ఎందరో ఈ పథకం సహాయంతో విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించగలుగుతున్నారు.

విద్యార్థులకు సన్న బియ్యం:

99. చదువుకునే వయసులో పిల్లలు పుష్టిగా ఉండాలంటే వారికి మంచి ఆహారం అవసరం. గతంలో ప్రభుత్వ హాస్టళ్లలో, రెసిడెన్షియల్ స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకానికి పురుగులు పట్టిన నాసిరకపు దొడ్డు బియ్యం సరఫరా చేసేవారు. ఈ అమానుష విధానాన్ని ప్రభుత్వం అంతం చేసింది. నేడు రాష్ట్రం లోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులందరికీ మేలు రకమైన సన్నబియ్యంతో వండిన అన్నం పెడుతున్నారు. ఈ పథకం వల్ల విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా పెరిగింది.

మిషన్ భగీరథ:

100. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరి తాగునీటి అవసరాలు తీర్చేందుకు మిషన్ భగీరథ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నది. ఈ పథకం ద్వారా శుద్ధి చేసిన నదీ జలాలను నల్లాల ద్వారా ప్రతీ ఇంటికి ప్రతీ రోజు అందిస్తాం. ఈ నెలాఖరు వరకు నదీ జలాలు అన్ని గ్రామాలకు చేరుకుంటాయి. గ్రామాలకు చేరిన నీటిని ప్రతీ ఇంటికి చేర్చడానికి వీలుగా అంతర్గత పైపులైన్ల నిర్మాణం, నల్లాల ఏర్పాటు లాంటి పనులు పురోగతిలో ఉన్నాయి. మిషన్ భగీరథ పథకం దేశంలోనే ఒక బృహత్తరమైన తాగునీటి పథకంగా ప్రశంసలు పొందుతున్నది.

కలుషితమైన నీటి వల్ల వచ్చే ఫ్లోరోసిస్ తదితర పీడల నుంచి ప్రజలు సంపూర్ణంగా బయటపడతారు.

101. కృష్ణా, గోదావరి నదీ జలాల నుండి శుద్ధి చేసిన 59.94 టి.ఎమ్.సి నీటిని తెలంగాణాలో ప్రతి ఇంటికి అందిచబోతున్నాము. 26 సెగ్మెంటులుగా, ఈ ప్రాజెక్ట్ విభజించబడినది. 67 ఇన్‌టేక్ వెల్స్, మరియు 153 నీటిని శుద్ధి చేసే ప్లాంటులు, 1,69,705 కిలోమీటర్ల పైప్‌లైన్లతో, 35,514 ఓ.హెచ్.ఆర్ ల ద్వారా పల్లెకు, పట్టణానికి, ప్రతి ఇంటికి నీరు చేరుతుంది.

102. ఈ భగీరథ మిషన్ ఫలితాలు ఇప్పటికే 5752 గ్రామీణ ఆవాసాలకు మరియు 15 పట్టణాలకు, 2900 గ్రామాలలో ఇంటి ఇంటికి చేరాయి. దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే ఈ కార్యసాధన ఫలితం, కళ్లముందు కనపడుతూ ఉంది. తెలంగాణ ప్రజల దాహార్తిని తీర్చే ఈ కార్యక్రమం రూపకల్పన చేయబడిన నాటి నుండి 4 సంవత్సరాల కాలంలోనే పూర్తి చేయడం మా ప్రభుత్వానికి గర్వకారణం. అనుకొన్న దానికన్నా ముందే నీళ్లు ఇస్తున్నందుకు, ఈ ప్రాజెక్ట్ కోసం అహర్నిశలు పనిచేసిన అందరినీ అభినందిస్తున్నాను.

103. మిషన్ భగీరథ పథకం కోసం ఈ ఏడాది బడ్జెట్లో రూ.1,801 కోట్లు ప్రతిపాదిస్తున్నాం. బడ్జెట్ నిధులే కాకుండా వివిధ బ్యాంకుల నుంచి, ఆర్థిక సంస్థల నుంచి నిధులను కూడా ఈ పథకానికి ప్రభుత్వం వినియోగిస్తున్నది.

తెలంగాణకు హరితహారం:

104. రాష్ట్రంలో ఆకుపచ్చని ఆచ్ఛాదనను పెంచడానికి ప్రభుత్వం తెలంగాణకు హరితహారం పేరుతో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 230 కోట్ల మొక్కలు నాటాలనే లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటికే 81 కోట్ల మొక్కలను నాటాం. ఈ ఏడాది మరో 40 కోట్ల మొక్కలు నాటడానికి ఏర్పాట్లు చేశాం. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 4 వేల నర్సరీలు ఏర్పాటు చేశాం. ప్రజలందరి భాగస్వామ్యంతో హరితహారం కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నది. ఈ పథకం కింద ఇప్పటి దాకా రూ.1,166 కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది.

రహదారుల నిర్మాణం:

105. నేటి సమాజంలో రహదారుల ప్రాముఖ్యం పెరిగింది. ఒక ప్రాంతాన్ని మరో ప్రాంతంతో అనుసంధానించే రహదారులు అభివృద్ధికి కొత్త దిశను కల్పిస్తున్నాయి. రోడ్ కనెక్టివిటీ ప్రగతిని వేగవంతం చేస్తుంది. రవాణారంగంలో వచ్చిన అభివృద్ధి వల్ల వ్యవసాయ, పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్యాలలో చలనశీలత పెరుగుతుంది.

ఆర్ అండ్ బి, పంచాయితీ రాజ్ రోడ్లు:

106. రాష్ట్రంలోని ఆర్ అండ్ బి, పంచాయితీరాజ్ రోడ్ల అభివృద్ధి, విస్తరణలో ప్రభుత్వం చాలా ప్రగతి సాధించింది. తెలంగాణ రాష్ట్రం

ఏర్పడిన తర్వాత ఆర్ అండ్ బి పరిధిలో 24,950 కిలోమీటర్లు, పంచాయితీ రాజ్ పరిధిలో 69,500 కిలోమీటర్ల రహదారులను అభివృద్ధి చేస్తున్నాము. అన్ని మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల మధ్య డబుల్ లేన్ రోడ్డు ఉండాలనే ప్రభుత్వ విధానం తీసుకున్నాం. ఇందుకోసం 1875 కిలోమీటర్ల మేర రోడ్లను విస్తరించాం. ఆర్ అండ్ బి పరిధిలో కొత్తగా 511 వంతెనల నిర్మాణం చేపట్టాం. పంచాయితీరాజ్ పరిధిలోని 6,617 కిలోమీటర్ల మట్టిరోడ్లను బి.టి రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నాం. 13,581 కిలోమీటర్ల బి.టి రోడ్లకు మరమ్మత్తులు చేశాం.

107. తెలంగాణ ఏర్పాటు తరువాత, గత నాలుగు సంవత్సరాలలో 4000 కిలో మీటర్ల గ్రామీణ బి.టి మరియు సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేయటం జరిగింది. పంచాయితీ రాజ్ గ్రామీణ ప్రాంత రోడ్ల నిర్మాణం సి.ఆర్.ఆర్ క్రింద రూ.1,080 కోట్లు ప్రతిపాదిస్తున్నాము. అదే విధంగా, గ్రామీణ రోడ్లు, బి.టి రోడ్లు పునర్మించడం కోసం ఎప్పుడూ లేని విధంగా, 12,657 కిలో మీటర్ల మేరకు ఎం.ఆర్.ఆర్ కార్యక్రమం క్రింద చేపట్టాము. దీనిలో ఇప్పటికే, రూ.1250 కోట్లతో, 11,322 కిలో మీటర్లు పూర్తి చేసాం.

108. ఈ ఏడాది బడ్జెట్లో రవాణా, రోడ్లు మరియు భవనాల శాఖకి 5,575 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం మరియు పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖకు 15,563 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం.

## కొత్త కలెక్టరేట్లు, పోలీస్ కార్యాలయాలు:

109. పాలనా సౌలభ్యం కోసం పెద్ద ఎత్తున పరిపాలనా సంస్కరణలు తీసుకొచ్చాం. కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో కార్యాలయాల ఏర్పాటుకు గత ఏడాది బడ్జెట్లో 600 కోట్ల రూపాయలు కేటాయించాం. ఈ బడ్జెట్లో రూ.500 కోట్లు కేటాయిస్తున్నాం.

26 జిల్లా కేంద్రాల్లో కొత్తగా సమీకృత జిల్లా కార్యాలయాలు, 13 చోట్ల పోలీస్ కార్యాలయాలు నిర్మాణంలో ఉన్నాయి. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేలకు కార్యాలయాలు నిర్మిస్తున్నాం. ఇప్పటికే 32 చోట్ల కార్యాలయాల నిర్మాణం పూర్తయింది. ఇతర చోట్లలో నిర్మాణం పనులు జరుగుతున్నాయి.

## విద్యుత్:

110. విద్యుత్ రంగంలో తెలంగాణ ప్రభుత్వం అనూహ్యమైన ప్రగతిని సాధించింది. అనతికాలంలో అద్భుతాన్ని ఆవిష్కరించింది. చరిత్రలో తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయంతో పాటు అన్ని రంగాలకు 24 గంటల పాటు నిరంతరాయ నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తున్నది. కరెంటు కోతలనే మాటలను ప్రజలు పూర్తిగా మరిచిపోయారు. గత ప్రభుత్వాల కాలంలో కరెంటు ఉంటే వార్త, ఈ ప్రభుత్వ పరిపాలనలో కరెంటు పోతే వార్త అని ప్రజలు ప్రశంసిస్తున్నారు.

111. చరిత్రలో ఏనాడూ ఎరుగనంతగా 10 వేల మెగావాట్ల గరిష్ట డిమాండ్ ఏర్పడినా, డిమాండ్ లక్ష్యానికి తగిన స్థాయిలో విద్యుత్ సరఫరా చేయగలుగుతున్నాం. రెప్పపాటు కూడా కోత లేకుండా విద్యుత్తును అందించడం ప్రభుత్వం సాధించిన ఘన విజయం. ఈ ఘనవిజయం ముఖ్యమంత్రి గారి కార్యదీక్షా దక్షతల వల్ల, విద్యుత్ సంస్థల అధికారులు, కార్మికుల నిబద్ధత, నిరంతర శ్రమ వల్ల సాధ్యమైంది.

112. విద్యుత్ సరఫరాలో వచ్చిన ఆద్భుతమైన అభివృద్ధి రాష్ట్ర ప్రగతికి ఉత్తేజాన్నిస్తున్నది. వ్యవసాయ ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. పరిశ్రమలు పవర్ హాలిడేలు ప్రకటించిన దుస్థితి నుంచి బయటపడి రోజుకు మూడు షిఫ్టులు పనిచేసి అధికోత్పత్తిని సాధిస్తున్నాయి. విద్యుత్ మీద ఆధారపడి చిన్న చిన్న వృత్తులు చేసుకునే వాళ్లకు మెరుగైన, స్థిరమైన ఆదాయం వస్తున్నది. కరెంటు కోతల చికాకులు లేకపోవడంతో జనజీవనంలో సౌఖ్యం కలిగింది. పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు నిరాటంకంగా చదువుకోగలుగుతున్నారు.

113. సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపాం. రాష్ట్రం ఏర్పడిన నాటికి కేవలం 31 మెగావాట్ల సౌర విద్యుత్ మాత్రమే అందుబాటులో ఉండేది. నేడు 3,283 మెగా వాట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న ఏకైకా రాష్ట్రంగా అరుదైన ఘనతను సొంతం చేసుకున్నది.

114. 2014లో రాష్ట్రంలో కేవలం 7,778 మెగా వాట్ల విద్యుత్ కాంట్రాక్టెడ్ సామర్ధ్యం మాత్రం ఉండేది. తెలంగాణను మిగులు విద్యుత్ రాష్ట్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం 28,275 వేల మెగావాట్ల కాంట్రాక్టెడ్ విద్యుత్ సామర్థ్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు నిరంతరం శ్రమిస్తున్నది. ఇప్పటికే 15,344 వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి తెచ్చింది. ఈ నెలాఖరు నాటికి కేటిపిఎస్ 7 వ దశ ద్వారా మరో 800 మోగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. 1080 మెగావాట్ల భద్రాద్రి పవర్ ప్లాంటు మొదటి దశ కూడా ఈ ఏడాది చివరి నాటికి పూర్తవుతుందని సంతోషంగా సభకు తెలియచేస్తున్నాను.

115. విద్యుత్ రంగంమీద ఈ బడ్జెట్లో రూ.5,650 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

చేనేత పరిశ్రమ/హాండ్లూమ్:

116. తెలంగాణచేనేతలకు ప్రసిద్ధి. ఇక్కత్ డిజైన్ గల పోచంపల్లి వస్త్రాలు అంతర్జాతీయంగా పేరు గాంచినవి. ఇంకా నారాయణ పేట, గద్వాల, సిద్దిపేట, సిరిసిల్ల తదితర ప్రాంతాల్లో తయారయ్యే విభిన్న రకాల చేనేత వస్త్రాలు ఎంతో ప్రఖ్యాతి పొందినాయి. సాంకేతికంగా వచ్చిన మార్పులు, మార్కెట్ సమస్యలు, పరిపాలకుల నిర్లక్ష్యం, వీటన్నింటి మూలంగా చేనేత పరిశ్రమ కుదేలయింది. చేనేత కార్మికులు ఆకలి చావులకు గురయ్యారు, ఆత్మహత్యల పాలయ్యారు. ఈ దుస్థితి నుంచి తప్పించి

చేనేత కార్మికులను ఆదుకునేందుకు ప్రయత్నాలను ప్రారంభించినాము.

117. చేనేత కార్మికులకు లక్ష రూపాయల వరకున్న రుణాలను మాఫీ చేసింది. మరోవైపు పవర్ లూమ్ పరిశ్రమను ఆదుకోవడానికి చర్యలు తీసుకున్నది. వస్త్రాల ఉత్పత్తికి అవసరమయ్యే నూలు, రసాయనాల మీద 50 శాతం సబ్సిడీ అందిస్తున్నాము. సబ్సిడీపై విద్యుత్ సరఫరా చేస్తున్నాం. దీని వల్ల పవర్ లూముల్లో ఉత్పత్తి వ్యయం తగ్గింది. ప్రభుత్వమే పూనుకుని కార్మికులకు నెలకు కనీసం 15 నుంచి 20 వేల రూపాయల వేతనం ఇచ్చేటట్టుగా యాజమాన్యాలను ఒప్పించింది.

118. చేనేత, పవర్ లూమ్ ద్వారా ఉత్పత్తి అయ్యే వస్త్రాలకు మార్కెట్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు మరియు ప్రభుత్వ పథకాలకు అవసరమైన వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నది.

మరమగ్గాల ఆధునీకరణకు పూర్తిస్థాయి సబ్సిడీ:

119. మరమగ్గాల ఆధునీకరణకు పూర్తిస్థాయి సబ్సిడీ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దుర్భరస్థితిలో ఉన్న మరమగ్గాల పరిశ్రమలను రక్షించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. మరమగ్గాల ఆధునీకరణకు అవసరమైన నిధులను చేనేత రంగానికి కేటాయించిన నిధుల నుండి వెచ్చిస్తున్నాము. ఎలాంటి పరిమితులు

లేకుండా ఎంత మంది కార్మికులకైనా సహాయం అందించాలని నిర్ణయించాము.

టెక్స్‌టైల్ పార్కు:

120. వస్త్ర నగరిగా వరంగల్ ప్రతిష్టను పెంచేందుకు కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కుకు గత ఆక్టోబర్ నెలలో స్వయంగా ముఖ్యమంత్రి గారే శంఖుస్థాపన చేశారు. అదే రోజు 22 సంస్థలు రూ.3,440 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. 1,190 ఎకరాల విస్తీర్ణంలో 1,075 కోట్ల రూపాయలతో టెక్స్ టైల్ పార్కు నిర్మాణం అవుతున్నది. వచ్చే అయిదేళ్లలో సుమారు 9,000 కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నాం. నూలు నుంచి రెడీమెడ్ వస్త్రాల తయారీ వరకు అన్ని రకాల అనుబంధ పరిశ్రమలతో ఏర్పాటయ్యే కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు దేశంలోనే అతి పెద్ద పార్కు కాబోతున్నది. 60,000 నుంచి 80,000 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి. ఈ బడ్జెట్‌లో చేనేత మరియు టెక్స్‌టైల్ రంగానికి రూ.1,200 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి కోసం ప్రభుత్వ చర్యలు:

121. తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి కోసం ప్రభుత్వం తెచ్చిన టి.ఎస్-ఐ.పాస్ చట్టం మంచి ఫలితాలను సాధిస్తున్నది.

122. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తరలివచ్చాయి. 6,206 పరిశ్రమలకు ఇప్పటికే అనుమతులు ఇచ్చాము. ఈ పరిశ్రమల ద్వారా లక్ష పద్దెనిమిది వేల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించడమే కాక 4.47 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి. అనుమతించిన యూనిట్లలో 3703 యూనిట్లు తమ కార్యకలాపాలను ప్రారంభించాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో తెలంగాణ దేశంలో ప్రథమస్థానంలో నిలిచింది.

123. రాష్ట్రంలో ఫార్మారంగాన్ని అభివృద్ధి చేయడానికి తెలంగాణ విశేష కృషి చేస్తుంది. ప్రభుత్వం సంగారెడ్డి జిల్లా సుల్తాన్ పూర్‌లో 250 ఎకరాల విస్తీర్ణంలో మెడికల్ డివైజస్ పార్కును ఏర్పాటు చేస్తుంది. దీని వలన దేశీయ వైద్య పరికరాల అవసరాలు తీరడమే కాక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

124. రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో 19,331 ఎకరాలలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఎకో ఫార్మాసిటీ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీని ద్వారా 4 లక్షల మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఖమ్మం జిల్లా బుగ్గపాడులో మెగా ఫుడ్ పార్కు ఏర్పాటు కోసం భూమిని కేటాయించాము.

125. ఇటీవల హైదరాబాద్ నగరంలో జరిగిన అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తల సదస్సు విజయవంతమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ సదస్సు విజయవంతం కావడానికి చేసిన కృషి ప్రపంచ వ్యాప్తంగా

ప్రశంసలు అందుకున్నది. ఈ సదస్సు నిర్వహణతో దేశ విదేశాల్లో హైదరాబాద్ నగర ఖ్యాతి ఇనుమడించింది.

126. ఈ బడ్జెట్ లో పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖకు రూ.1,286 కోట్లు కేటాయిస్తున్నము.

<u>ఐ.టి:</u>

127. సమాచార సాంకేతిక విజ్ఞానానికి పట్టుగొమ్మగా తెలంగాణ ప్రసిద్ధి పొందింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఐటి విధానంతో ఎన్నో అగ్రశేణి ప్రపంచ ఐటి సంస్థలు తమ కార్యకలాపాలను హైదరాబాద్‌కు విస్తరించాయి. గూగుల్, డిలాయిట్, ఫేస్బుక్, కాగ్నిజెంట్, ఒరాకిల్, ఆపిల్, సేల్స్ ఫోర్స్, అడోబ్ వంటి దిగ్గజ సంస్థలు హైదరాబాద్ నుండి తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. తెలంగాణా ప్రభుత్వం వినూత్న తరహాలో స్థాపించిన టీ హబ్ ద్వారా దాదాపు 200 అంకుర సంస్థలు ప్రేరణ పొందాయి.

128. గ్లోబల్ ఎంటర్ప్రెన్యూర్షిప్ సమ్మిట్-2017 లో చేసిన వాగ్దానం మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న తెలంగాణ ప్రభుత్వం వి-హబ్ (WE-HUB) ని ఆవిష్కరించింది. మహిళల ఆవిష్కరణలను వెన్నుతట్టి ప్రోత్సహించేందుకు వి-హబ్ పనిచేస్తుంది.

129. వి-హబ్ ఆవిష్కరణలలో 25 శాతం ఆవిష్కరణలను తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేసి మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తుంది. మహిళల్లో దాగున్న సృజనాత్మక శక్తిని వెలికి తీసి వారికి అండగా నిలిచేందుకు వి-హబ్ కృషి చేస్తుంది. మహిళల సాధికారతకు దోహదపడే వి-హబ్‌కు ప్రారంభ పెట్టుబడిగా రూ. 15 కోట్లు కేటాయించడం జరిగింది.

130. ఐటి ఎగుమతుల్లో మన రాష్ట్రం వరుసగా మూడేళ్ల పాటు జాతీయ సగటును మించింది. గత ఏడాది జాతీయ సగటు వృద్ధి శాతం పది శాతమైతే, తెలంగాణ రాష్ట్రం 13.85 వృద్ధి శాతం సాధించింది. ఐ.టి.రంగాన్ని హైదరాబాదు నగరంతో పాటు రాష్ట్రంలోని రెండవ శ్రేణి నగరాల్లో కూడా విస్తరింప చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించింది. వరంగల్, కరీంనగర్, ఖమ్మంలలో ఐ.టి. హబ్ విస్తరణకు ముమ్మరంగా కృషి చేస్తున్నది. వరంగల్ నగరంలో ఐ.టి సెజ్ ఏర్పాటుకు 45 ఎకరాలను కేటాయించడమే కాక, అంకుర సంస్థల ఏర్పాటును ప్రోత్సహించేందుకు 15,000 చదరపు అడుగుల విస్తీర్ణం గల భవన నిర్మాణాన్ని చేపట్టాము.

131. రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలలో, గ్రామీణ ప్రాంతాలలో కూడా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి సంస్థలను, బి.పి.ఓ. సంస్థల స్థాపనను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. ఇందులో భాగంగా జనగామ, కరీంనగర్, ఖమ్మంలలో కొన్ని సాఫ్ట్‌వేర్ సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించాయి.

132. ఈ బడ్జెట్‌లో ఐటి రంగానికి రూ.289 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

నగరాల  అభివృద్ధికి చర్యలు:

133. హైదరాబాద్ నగరంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నది. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం శాశ్వత ప్రాతిపదికన పథకాన్ని రూపొందించింది. భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకొని రాబోయే 20 నుంచి 40 సంవత్సరాల వరకు మళ్లీ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు రహదారుల వ్యవస్థను మెరుగుపరచేందుకు హైదరాబాద్ నాలుగు దిక్కుల ఎక్స్‌ప్రెస్‌వేలు, హైవేలు మరియు ఆకాశ వీధులు (స్కైవేలు) లను నిర్మించేందుకు మన ముఖ్యమంత్రి గారు చర్యలు చేపట్టారు.

134. హైదరాబాద్ నగరానికి తలమానికంగా నిలిచిన మెట్రో రైలును నాగోల్-మియాపూర్ మార్గాన్ని గౌరవ ప్రధాని నరేంద్ర మోడి గారి చేతులమీదుగా ఇటీవలే ప్రారంభించుకున్నాం. మరో కొద్ది నెలల్లో మిగతా మార్గాల నిర్మాణం కూడా పూర్తి అవుతుంది.

135. హైదరాబాద్ తర్వాత తెలంగాణలో పెద్ద నగరం వరంగల్. ఈ నగరంలో మౌళిక వసతులు కల్పించడానికి ప్రభుత్వం ప్రతి ఏటా బడ్జెట్‌లో 300 కోట్ల రూపాయలు కేటాయిస్తున్నది. ఈ బడ్జెట్‌లో యధావిధిగా 300 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నది. తెలంగాణలోని మిగతా కార్పొరేషన్లలో అభివృద్ధి పనుల కోసం 400 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం.

ఈ బడ్జెట్‌లో పురపాలక మరియు పట్టణ అభివృద్ధి శాఖకు రూ.7,251 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

## సాంస్కృతికం:

136. ఒక జాతి ఆత్మ ఆ జాతి సంస్కృతిలో ప్రతిఫలిస్తుంది. తెలంగాణ సంస్కృతి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ప్రతీ ఏటా బతుకమ్మ, బోనాల పండుగులను రాష్ట్ర పండుగలుగా అధికారికంగా ఘనంగా నిర్వహిస్తున్నది. తెలంగాణ మహనీయుల పేరిట అవార్డులను అందిస్తున్నది. ఇటీవలనే సాహిత్య అభివృద్ధి కోసం సాహిత్య అకాడమీని స్థాపించింది. సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్ లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలు తెలంగాణ కీర్తిని  దశ దిశలా వ్యాపింపచేశాయి. నగరంలోని రవీంద్రభారతితో సహా తెలంగాణ వ్యాప్తంగా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిరంతరం సంగీత, సాహిత్య, కళా సంబంధమైన కార్యక్రమాలెన్నో నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమాలు తెలంగాణ సంస్కృతిని వికసింపచేయడంతో పాటు, సంగీత సాహిత్యాభిమానులలో నూతనోత్తేజం కలిగిస్తున్నాయి.

137. ఈ ఏడాది బడ్జెట్‌లో సాంస్కృతిక రంగానికి రూ.58 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

## దేవాలయాల అభివృద్ధి - సిబ్బంది సంక్షేమము:

138. యాదగిరి గుట్ట దేవాలయ ప్రాంత అభివృద్ధి అధికారిక సంస్థ ద్వారా చేపట్టిన ఆలయ మరియు పరిసర ప్రాంతముల పునర్నిర్మాణ, అభివృద్ధి పనులలో ముఖ్యమైనవి ఈ సంవత్సరం పూర్తి కానున్నాయి. ఇది దృష్టిలో పెట్టుకొని ఈ పనులకు రూ.250 కోట్లు ప్రతిపాదించడమైనది. అదే విధంగా వేములవాడ దేవాలయ ప్రాంత అభివృద్ధి అధికారిక సంస్థకు రూ.100 కోట్లు ప్రతిపాదించడమైనది. ఇదే తరహాలో భద్రాచలం, బాసర మరియు ధర్మపురి దేవాలయ ప్రాంతాల అభివృద్ధికి శ్రీకారం చుట్టడానికి ఈ సంవత్సరం వరుసగా, రూ.100 కోట్లు, రూ.50 కోట్లు, రూ.50 కోట్లు ప్రతిపాదించడమైనది.

139. ఆదాయ వనరులు లేక కావలసిన నిర్మాణ, పునర్నిర్మాణ పనులకు నోచుకోని దేవాలయాల అభివృద్ధికై పెద్ద ఎత్తున వస్తున్న విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకొని ఎండోమెంట్ చట్టం కింద ఏర్పాటు చేయబడిన కామన్ గుడ్ ఫండ్ నిధికి సహాయముగా రూ.50 కోట్లు ప్రతిపాదించడమైనది.

140. గౌరవ ముఖ్యమంత్రి గారి చొరవతో దేవాలయాలలో పనిచేయుచున్న అర్చక మరియు ఇతర సిబ్బందికి పి.ఆర్.సి. 2015 సమాన వేతనాలను అమలు చేయుటకు జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను అందరూ హర్షించడం జరిగింది. ఈ పథకం అమలుకు

ప్రభుత్వ సహాయంగా ఈ సంవత్సరం రూ.72 కోట్లు ప్రతిపాదించడం జరిగింది.

## శాంతి భద్రతలు - పోలీస్ సంక్షేమం:

141. అనేక దశాబ్దాలుగా నిత్యం అలజడి, అశాంతులతో తెలంగాణ సమాజం అట్టుడికింది. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత, చరిత్రలో మొదటిసారిగా ప్రశాంతంగా జీవనం కొనసాగుతున్నది. ప్రజల్లో భవిష్యత్తు పట్ల భరోసా ఏర్పడం ఒక కారణమైతే, నేరాలను అదుపులో ఉంచే శాంతి, భద్రతల వ్యవస్థ ప్రభావవంతంగా పనిచేయడం మరో కారణం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే ప్రభుత్వం పోలీస్ శాఖను పూర్తిగా ఆధునీకరించింది. అవసరమైన సిబ్బందిని నియామకాలు జరపడంతో పాటు, కావాల్సిన వాహనాలు, ఆధునిక సాంకేతిక పరికరాలు అందించి పోలీస్ శాఖను పటిష్టపరిచింది. పోలీస్ శాఖలో అనేక సంస్కరణలు అమలు జరిపింది. పోలీస్‌ల సేవలు ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 7 పోలీస్ కమీషనరేట్లను ఏర్పాటు చేసింది. వీటితో పాటు 27 కొత్త పోలీస్ సబ్ డివిజన్లను, 29 సర్కిళ్లను, 103 పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేసింది.

142. హోంగార్డుల దుస్థితిని గమనించి, ప్రభుత్వం స్పందించింది. తెలంగాణ ఏర్పడిన నాడు హోంగార్డుల వేతనం కేవలం 9,000 మాత్రమే. తెలంగాణ ప్రభుత్వం హోంగార్డులకు ఇప్పుడు 20,000 రూపాయలకు వేతనం పెంచింది. ప్రమాదకర పరిస్థితులను

ఎదుర్కొంటూ ట్రాఫిక్ పోలీస్‌లు చేసే సేవలకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపును ఇచ్చింది. వారికి మూల వేతనంపై 30 శాతం ప్రత్యేక ప్రమాద అలవెన్సును ఇచ్చి గౌరవించింది. పోలీస్ శాఖ నియామకాలలో అభ్యర్ధులకు విధించిన కనీస వయో పరిమితిని సడలించింది. ఎంతో కాలంగా పెండింగ్ లో ఉన్న పోలీస్ అధికారులకు పదోన్నతి కల్పించింది. హోం శాఖకి  ఈ బడ్జెట్‌లో రూ.5,790 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

ఉద్యోగుల సంక్షేమం:

143. ఉద్యోగుల సంక్షేమానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉన్నది. ప్రభుత్వ ఉద్యోగులకు పి.ఆర్.సి వేతన పెంపుదలలో దేశంలోనే మన రాష్ట్రం ఆదర్శంగా ఉంది. అదే విధంగా హోంగార్డులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, అంగన్‌వాడి ఉద్యోగులు, ఏ.ఎన్.ఎం లు, ఆశా వర్కర్లు, విద్యా వాలంటీర్లు, వి.ఆర్.ఏ లు, పార్ట్ టైం మరియు ఫుల్ టైం కాంటింజెంట్ ఉద్యోగులు, సెర్ప్ ఉద్యోగులు 2,27,782 మంది ఉద్యోగుల వేతనాలు సంవత్సరానికి రూ.1023.43 కోట్ల ఖర్చుతో గతంలో ఎన్నడూ లేని విధంగా పెంచిన ఘనత మా ప్రభుత్వానిదే.

ఉద్యోగులు, జర్నలిస్టులకు కార్పొరేటు దవాఖానాల్లో నగదురహిత వైద్యం అందుబాటు లోకి తెచ్చాం. వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ఉద్యోగులకు ఓ.పి. సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి.

ఉద్యోగ నియామకాలు:

144. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత, ఉద్యోగుల విభజన, కోర్టు కేసులు వంటి అనేక సమస్యలను అధిగమించి, ఇప్పటివరకు 1,10,012 నేరు నియామక ఖాళీలు గుర్తించడం జరిగింది. అందులో 83,048 ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశాము. 27,588 సంఖ్య ఉద్యోగాల నియామకాలు పూర్తి అయినవి. మిగిలిన ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయుటకు అన్ని చర్యలు తీసుకొనడం జరుగుతుంది.

2016-17 అకౌంట్లు:

145. తెలంగాణ అకౌంటెంట్ జనరల్ గారు ధృవీకరించిన లెక్కల ప్రకారం 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ.1,33,823 కోట్లు ఖర్చు అయింది. రెవెన్యూ మిగులు రూ.1386 కోట్లు.

సవరించిన అంచనాలు 2017-18:

146. 2017-18 సవరించిన అంచనాల ప్రకారం మొత్తం ఖర్చు రూ.1,42,506 కోట్లుగా అంచనా వేశాము. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.1,06,603 కోట్లు కాగా, క్యాపిటల్ వ్యయం రూ.25,447 కోట్లు. ఇది సవరించిన అంచనాలలో 95 శాతం. జి.ఎస్.టి ప్రారంభించడం వల్ల కలిగిన ప్రారంభ ప్రతికూల పరిణామాల వల్ల ఆదాయం పెరుగుదల గత ఆర్థిక సంవత్సరం కంటే స్వల్పంగా తగ్గింది.

బడ్జెట్ అంచనాలు 2018-19:

147. 2018-19 లో రాష్ట్ర స్వంత ఆదాయం రూ.73,751.88 కోట్లు. 2017-18 సంవత్సర సవరించిన అంచనాలతో పోలిస్తే 20 శాతం అధికం. కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులు 2017-18 బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.26,857.67 కోట్లు, కాగా, 2018-19 బడ్జెట్‌లో రూ.29,041.88 కోట్లను ఆశిస్తున్నాము. ఈ ఆశించిన పెరుగుదల నామ మాత్రమే.

2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.1,74,453.84 కోట్ల వ్యయాన్ని ప్రతిపాదిస్తున్నాను. దీనిలో రెవెన్యూ వ్యయం రూ.1,25,454.70 కోట్లు, మరియు క్యాపిటల్ వ్యయం రూ.33,369.10 కోట్లు. మొత్తం ప్రతిపాదించిన వ్యయంలో క్యాపిటల్ వ్యయం 19 శాతం. ఇది మిగతా రాష్ట్రాలతో పోల్చితే చాలా ఎక్కువ.

148. క్యాపిటల్ పద్దు కింద ఉమ్మడి రాష్ట్రంలో 2013-14 లో ఖర్చు అయిన మొత్తం రూ. 15,280 కోట్లు మాత్రమే. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత క్యాపిటల్ వ్యయం గణనీయంగా పెరిగిందని గౌరవ సభ్యులు గుర్తించాలని మనవి.

149. ప్రభుత్వ పథకాలను అమలు చేసే కార్పోరేషన్లు బడ్జెటేతర పద్ధతుల్లో కూడా నిధులు సమకూర్చుకుంటున్నాయి. కాబట్టి మొత్తం వ్యయం, బడ్జెట్‌లో ప్రతిపాదించిన దానికంటే ఎక్కువగా ఉంటుందని గౌరవ సభ్యుల దృష్టికి తెస్తున్నాను.

2018-19 సంవత్సరంలో రెవెన్యూ మిగులు రూ.5520.41 కోట్లు, ద్రవ్యలోటు రూ.29077.07 కోట్లు ఉండగలదని అంచనా వేస్తున్నాము. ద్రవ్యలోటు రాష్ట్ర జిడిపిలో 3.45 శాతం.

ముగింపు:

150. అనేక ప్రతికూల పరిస్థితులు, అస్పష్టతలు, అనుమానాలు, సవాళ్ల మధ్య ఏర్పడిన నూతన రాష్ట్రం అనతికాలంలోనే అనేక విషయాల్లో దేశానికి ఆదర్శంగా నిలిచే స్థాయికి ఎదిగింది. ప్రజాసంక్షేమం, మౌలిక వసతుల కల్పన, పాలనా సంస్కరణల్లో తెలంగాణ చూపిన మార్గం తమకు కూడా అనుసరణీయమని ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు భావిస్తున్నాయి. వర్తమానంలో ప్రభుత్వం సాధిస్తున్న విజయాలతో భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందనే ఆత్మ విశ్వాసం నేడు తెలంగాణా సమాజంలో తొణికిసలాడుతున్నది. ఆ విశ్వాసమే ప్రాతిపదికగా, బంగారు తెలంగాణా నిర్మాణం ధ్యేయంగా రాష్ట్ర ప్రజల సమాగ్రాభివృద్ధి కోసం రూపొందించిన ఈ వార్షిక బడ్జెట్‌ను ఆమోదించవలసిందిగా గౌరవ సభ్యులను తమరి ద్వారా కోరుతున్నాను.

//జైహింద్//

//జై తెలంగాణ//